ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:94 | ఎడిటర్:మేనం శ్యామ్ | ఆదివారం 25-10-2026 | పేజీలు: 10

సిరా చుక్క

చెమటనే నీరుగా మార్చి,
ఎండిన నేలను తడిపి,
దేశ కడుపు నింపే అన్నదాతకు
నేడు ఒక్క చుక్క నీరు కూడా
దక్కపోవడం
మన వ్యవస్థల
చేతకానితనానికి పరాకాష్ఠ!
ఆరుగాలం శ్రమించిన రైతు
కన్నీళ్లు పెట్టుకుంటే కరుణించని నేల,
అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే
పట్టించుకోని సమాజం!
చేను ఎండిపోయి, ఆశలు అడుగంటి
చివరకు ప్రాణాలు వదులుతుంటే...
అది కేవలం ఆత్మహత్య కాదు,.....
అది పాలకులు,
సమాజం కలిసి చేస్తున్న
సమూహ హత్య!
"నాగలి పట్టిన చేతికి ఉరితాడు దక్కడం...
బియ్యం గింజను అందించిన వేలికి
చితిమంటలు తోడవటం...
మానవత్వం చచ్చిపోయిన
ఈ సమాజానికి దక్కిన అతిపెద్ద శాపం
రైతన్నకు అండగా నిలుద్దాం...
దేశానికి రైతన్న ఆదర్శం అని తెలుపుదాం.

వారే వేణు గోపాల్.
పాపన్నపేట...మెదక్ జిల్లా

తెలంగాణపై బీజేపీ హైకమాండ్ గురి

- మోదీ–షా రంగంలోకి
- మిషన్ 2028కు కసరత్తు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రధాన పార్టీల వ్యూహాలు
- తెలంగాణలో పట్టు పెంచుకోవడంపై బీజేపీ ప్రత్యేక దృష్టి
- నవంబర్‌లో అమిత్ షా రాష్ట్ర పర్యటనకు ప్రణాళిక
- డిసెంబర్‌లో ప్రధాని మోదీ పర్యటనపై ఆసక్తి
- గ్రేటర్ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికలపై పార్టీల ఫోకస్

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణ రాజకీయాల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల దిశగా ఇప్పటి నుంచే కసరత్తు మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన దిశగా సాగుతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు తమ బలాబలాలను అంచనా వేసుకుంటూ కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, తిరిగి పుంజుకోవాలని బీఆర్ఎస్ ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న రాజకీయ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

2028 ఎన్నికలే లక్ష్యంగా అడుగులు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పిస్తూ రాజకీయంగా బలపడాలని చూస్తోంది. మరోవైపు, తెలంగాణలో పట్టు పెంచుకోవడం ద్వారా దక్షిణాదిలో తన ప్రభావాన్ని విస్తరించాలని బీజేపీ భావిస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణతో పాటు కర్ణాటకపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మోదీ–షా పర్యటనలపై ఆసక్తి

తెలంగాణలో పార్టీ సంస్థాగత బలోపేతంపై బీజేపీ అగ్రనాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పర్యటనలో పార్టీ సంస్థాగత నిర్మాణం, నాయకుల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాల బలోపేతంపై దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనుంది. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు భారీ బహిరంగ సభ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనల అనంతరం

మిగతా 2లో

సోమాజిగూడ బార్ అండ్ రెస్టారెంట్‌లో యువకుడి హల్‌చల్

- కాల్చేస్తానంటూ హెచ్చరిక
- బిల్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని సిబ్బందితో వాగ్వాదం
- థార్ కారు నుంచి రివాల్వర్ తీసి బెదిరింపులు
- భయంతో పరుగులు తీసిన కస్టమర్లు, సిబ్బంది
- నిందితుడు మహ్మద్ షానవాజ్ (24) పోలీసుల అదుపులో
- రివాల్వర్, థార్ వాహనం స్వాధీనం

2లో

'ప్రజలకు బాసులం కాదు.. సేవకులం'

- ఆకలి బాధల నుంచి మంత్రి పదవి వరకు.. సీతక్క పోరాట ప్రస్థానం
- పేదరికం, అన్యాయాలు తనను నక్సలైట్‌గా మార్చాయని వెల్లడి
- అడవుల నుంచి న్యాయవాదిగా.. ఎమ్మెల్యేగా.. మంత్రిగా ఎదిగిన ప్రయాణం
- ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచన
- రాజకీయాల్లో మహిళలు ఇప్పటికీ వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన
- అంకితభావం, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని పిలుపు

హైదరాబాద్, ప్రజా వాయిస్: పేదరికం, ఆకలి బాధలు.. సమాజంలో కనిపించిన అన్యాయాలు తన జీవితాన్ని ప్రభావితం చేశాయని తెలంగాణ మంత్రి ధనసరి సీతక్క వెల్లడించారు. చిన్నతనంలో ఎదురైన పరిస్థితులను తట్టుకోలేక నక్సలైట్‌గా మారానని, ఆ తర్వాత న్యాయవాదిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదుగుతానని అప్పట్లో ఊహించలేదని తెలిపారు. తన జీవన ప్రయాణం ఎన్నో కష్టాలు, పోరాటాలతో సాగిందని వివరించారు. హైదరాబాద్ మాదాపూర్‌లో శనివారం నిర్వహించిన 'పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వం' సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె తన అనుభవాలను పంచుకున్నారు.

పేదరికం నుంచి ప్రజాసేవ వరకు

ములుగు ప్రాంతంలోని పేద కుటుంబంలో జన్మించిన తనకు రాజకీయ వారసత్వం లేదని సీతక్క పేర్కొన్నారు. చిన్నతనంలో పేదరికం, ఆకలి బాధలను ఎదుర్కొన్నానని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూడలేక నక్సలైట్‌గా మారానని చెప్పారు. కొంతకాలం అజ్ఞాత జీవితంలో గడిపిన అనంతరం న్యాయవాదిగా మారి, ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికై.. చివరకు మంత్రిగా బాధ్యతలు చేపట్టే స్థాయికి చేరుకున్నానని వివరించారు. ఈ ప్రయాణంలో ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు పట్టుదలతో పనిచేశానని తెలిపారు.ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా సేవలందించే అవకాశం లభించిందని చెప్పారు. తన ఎదుగుదలకు రాజకీయ వారసత్వం కంటే కష్టపడే తత్వం, పట్టుదలే ముఖ్య కారణమని పేర్కొన్నారు.

ప్రజలకు దూరం కావొద్దు

ప్రజాప్రతినిధులు పదవులు చేపట్టిన తర్వాత తమ మూలాలను మర్చిపోకూడదని సీతక్క సూచించారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని, వారికి జవాబుదారీగా పనిచేయాలని అన్నారు. తాను ఇప్పటికీ ప్రతి వారం రెండు రోజులు ములుగు ప్రజలతో గడుపుతున్నానని వెల్లడించారు.ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగిన తర్వాత ప్రజలకు దూరంగా ఉంటేనే గౌరవం పెరుగుతుందని కొందరు భావిస్తారని, తాను మాత్రం ఆ అభిప్రాయంతో ఏకీభవించనని చెప్పారు. ప్రజలతో నిరంతర సంబంధాలు

మిగతా 2లో

కాంగ్రెస్-బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ ఆపండి

- బిజెపి ఎంపి రఘునందన్ రావు
- గ్రామాల్లో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తే కరెంట్ కోతలు తగ్గుతాయి
- రాజకీయ విమర్శలు మాని విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టాలి
- ప్రతి ఇంటికి 2 కిలోవాట్ల సోలార్ ఏర్పాటు చేయాలని ఎంపి సూచన
- కేంద్రం అందిస్తున్న 60 శాతం సబ్సిడీని రాష్ట్రం వినియోగించుకోవాలి
- 50 శాతం ఇళ్లపై సోలార్ ఏర్పాటు చేస్తేనే పంచాయతీ నిధులివ్వాలని డిమాండ్
- మల్లన్నసాగర్ కాలువల నిర్మాణంపై ప్రభుత్వాలను నిలదీత

2లో

ఆసుపత్రులకు కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరిక

- ఒక్కసారి వాడాల్సిన వైద్య పరికరాలను తిరిగి వినియోగించడంపై ఆందోళన
- నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, వైద్యులపై చర్యలకు ఆదేశాలు
- ఇన్‌ఫెక్షన్లు, ప్రాణాపాయ సమస్యలు తలెత్తే అవకాశం
- రాష్ట్రాల ఆరోగ్య శాఖలు పర్యవేక్షణ పెంచాలని సూచన
- అనుమానం ఉంటే వైద్యులను ప్రశ్నించాలని రోగులకు నిపుణుల సూచన

హైదరాబాద్, ప్రజా వాయిస్: రోగుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఒక్కసారి మాత్రమే వినియోగించాల్సిన వైద్య పరికరాలను కొన్ని ఆసుపత్రులు తిరిగి ఉపయోగిస్తున్నాయన్న అంశంపై కేంద్ర ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ఈ విధానాన్ని అరికట్టేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ పరిధిలోని ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులు, వైద్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

పునర్వినియోగంతో ఆరోగ్యానికి ముప్పు

ఒక్కసారి మాత్రమే వాడాల్సిన పరికరాలను మళ్లీ వినియోగిస్తే రోగులకు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. పరికరాల పనితీరు దెబ్బతినడం వల్ల చికిత్స సమయంలో ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత చికిత్సల్లో యాంజియోప్లాస్టీ, పేస్‌మేకర్ అమరికలు, మూత్రపిండాల శస్త్రచికిత్సల

మిగతా 2లో

కేటీఆర్ కుటుంబంపై ఎంపీ అర్వింద్ తీవ్ర ఆరోపణలు

- దోపిడీలు, హత్యలకు పాల్పడిన చరిత్ర అంటూ విమర్శలు
- తనపై గతంలో హత్యాయత్నం జరిగిందని అర్వింద్ ఆరోపణ
- ముస్లిం మైనారిటీలతో మాట్లాడిన పాత వీడియో వైరల్‌పై వివరణ
- మోదీ పథకాల లబ్ధిదారులు ఆయనకు మద్దతివ్వాలని సూచించానని వెల్లడి
- సందర్భాన్ని వక్రీకరించి తనపై విమర్శలు చేస్తున్నారని మండిపాటు

2లో

ఎక్సైజ్ దాడుల్లో పిస్తోళ్లు, రివాల్వర్లు, బుల్లెట్లు స్వాధీనం

- తెలంగాణలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- అత్తాపూర్‌లో గంజాయితో పాటు రివాల్వర్, నాలుగు పిస్తోళ్లు పట్టివేత
- భద్రాచలం–పాల్వంచ మార్గంలో 106 కిలోల గంజాయి స్వాధీనం
- పాల్వంచ కేసులో పిస్తోలు, ఐదు రివాల్వర్లు, 40 బుల్లెట్లు పట్టివేత
- స్మగ్లింగ్ ముఠాలకు ఆయుధాలు ఎలా చేరుతున్నాయనే కోణంలో దర్యాప్తు

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణలో గంజాయి అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో మారణాయుధాలు కలకలం సృష్టించాయి. శనివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో గంజాయి స్మగ్లర్ల వద్ద నుంచి పిస్తోళ్లు, రివాల్వర్లు, బుల్లెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాతో పాటు ఆయుధాలు కూడా బయటపడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

అత్తాపూర్‌లో ఆయుధాల పట్టివేత

రాజేంద్రనగర్ పరిధిలోని అత్తాపూర్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించగా.. గంజాయితో పాటు ఒక రివాల్వర్, నాలుగు పిస్తోళ్లు పట్టుబడ్డాయి. గంజాయి స్మగ్లింగ్ ముఠాల వద్ద ఇన్ని ఆయుధాలు లభించడం ఆందోళన కలిగిస్తోంది.

మిగతా 2లో

కాంగ్రెస్–బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ ఆపండి

హైదరాబాద్, ప్రజా వాయిస్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు చేసుకోవడం మానేసి గ్రామాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. ప్రతి ఇంటిపై రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్యలను తగ్గించుకోవచ్చని అన్నారు. ఇదే నిర్లక్ష్యం కొనసాగితే వచ్చే ఏడాది సెక్రటేరియట్‌లో సీఎం లిఫ్ట్, ఇంట్లో ఏసీ కూడా పనిచేయని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయని, అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని రఘునందన్‌రావు ఆరోపించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. ప్రతి ఇంటిపై రెండు కిలోవాట్ల సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలకు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం గృహ సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు 60 శాతం సబ్సిడీ ఇస్తున్నందున, ఆ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వినియోగించుకోవడం లేదని నిలదీశారు. గ్రామాల్లో 50 శాతం ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసినప్పుడే పంచాయతీ నిధులు ఇస్తామని ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.

మల్లన్నసాగర్ కాలువలపై విమర్శలు

మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు కాలువలు నిర్మించలేదని ఎంపీ ఆరోపించారు. గత ముఖ్యమంత్రికి, ప్రస్తుత ముఖ్యమంత్రికి ఒకే కాంట్రాక్టర్ సన్నిహితుడని వ్యాఖ్యానిస్తూ, ‘‘అందరూ దోస్తులైతే దుబ్బాక కాలువలు ఎవరు తవ్వుతారు’’ అని ఎద్దేవా చేశారు.విద్యుత్ సమస్యల పరిష్కారం, సాగునీటి కాలువల నిర్మాణం వంటి అంశాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ దాడుల్లో పిస్తోళ్లు, రివాల్వర్లు, బుల్లెట్లు స్వాధీనం

పాల్వంచ మార్గంలో

106 కిలోల గంజాయి

మరో ఘటనలో భద్రాచలం–పాల్వంచ మార్గంలో అధికారులు 106 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక పిస్తోలు, ఐదు రివాల్వర్లు, 40 బుల్లెట్లు, 12 ఖాళీ మ్యాగజైన్లను కూడా పట్టుకున్నారు. రెండు ఘటనల్లోనూ గంజాయి అక్రమ రవాణాతో పాటు ఆయుధాల లభ్యతపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్సైజ్ సిబ్బంది భద్రతపై ప్రశ్నలు

గంజాయి స్మగ్లింగ్ ముఠాలకు ఆయుధాలు ఎలా అందుతున్నాయనే కోణంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మరోవైపు, ఆయుధాలు లేకుండా దాడులకు వెళ్తున్న ఎక్సైజ్ సిబ్బంది భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధాలు అందించాలనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం

మూడు విభాగాల సమన్వయానికి సూచనలు

గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, ఎక్సైజ్, ఈగల్ టీమ్స్ సమన్వయంతో పనిచేయాలని పలువురు అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలుస్తోంది. ఆయుధాల మూలాలు, స్మగ్లింగ్ నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతోంది.

బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు వివాదం

- ‘శ్రీరామ్ చౌక్’ పేరు పిలుపుపై అభ్యంతరాలు
- అనుమతులపై ప్రశ్నలు
- దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించిన అధికారులు
- క్రేన్‌తో విగ్రహాన్ని లారీలోకి ఎక్కించిన సిబ్బంది
- అనుమతులు లేకుండానే విగ్రహం ఏర్పాటు చేశారని ఎంబీటీ ఆరోపణ
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసుల మోహరింపు

హైదరాబాద్, ప్రజా వాయిస్: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రధాన కూడలిలో శ్రీరాముడి విగ్రహం తొలగింపు వివాదానికి దారితీసింది. దసరా పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని అధికారులు శనివారం తొలగించడంతో స్థానికంగా చర్చ మొదలైంది. ఈ చర్యపై హిందూ సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేయగా.. విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా అనే అంశాన్ని మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నాయకులు ప్రశ్నించారు.

క్రేన్‌తో విగ్రహం తొలగింపు

బషీర్‌బాగ్ చౌరస్తాలోని అమ్మవారి ఆలయం సమీపంలో విజయదశమి సందర్భంగా శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్ ఈ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ఇకపై ఈ కూడలిని ‘శ్రీరామ్ చౌక్’గా పిలవాలని ఆయన హిందువులకు పిలుపునిచ్చారు.అయితే, శనివారం అధికారులు క్రేన్ సాయంతో విగ్రహాన్ని తొలగించి లారీలోకి ఎక్కించారు. ఈ విషయం తెలిసి హిందూ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహం తొలగింపునకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించాల్సి ఉంది.

పేరు మార్పుపై ఎంబీటీ అభ్యంతరం

బషీర్‌బాగ్ కూడలికి ‘శ్రీరామ్ చౌక్’గా పేరు పెట్టాలన్న పిలుపుపై ఎంబీటీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంబీటీ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లా ఖాన్ స్పందిస్తూ.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ నగర పోలీసుల అనుమతులు లేకుండానే విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. కూడలి పేరు మార్పుపై పిలుపునిచ్చిన సమయంలో అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

భారీగా పోలీసుల మోహరింపు

విగ్రహం తొలగింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా, తొలగింపునకు అధికారులు చూపిన కారణాలేమిటి, కూడలి పేరు మార్పుపై అధికారికంగా ఏదైనా ప్రతిపాదన ఉందా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.ఒకవైపు విగ్రహం తొలగింపుపై హిందూ సంఘాల అభ్యంతరాలు, మరోవైపు అనుమతులపై ఎంబీటీ ప్రశ్నలతో బషీర్‌బాగ్ వ్యవహారం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

సోమాజిగూడ బార్ అండ్ రెస్టారెంట్‌లో యువకుడి హల్‌చల్

హైదరాబాద్, ప్రజా వాయిస్: నగరంలోని సోమాజిగూడలో ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో యువకుడు రివాల్వర్‌తో కలకలం సృష్టించాడు. బిల్లు డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన అతడు.. తుపాకీతో కస్టమర్లు, బౌన్సర్లను బెదిరించాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బిల్లు విషయంలో వాగ్వాదం

పోలీసుల కథనం ప్రకారం.. మహ్మద్ షానవాజ్ (24) అనే యువకుడు సోమాజిగూడలోని బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ బిల్లు చెల్లించిన అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వాలని సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన యువకుడు బయట పార్క్ చేసిన తన థార్ వాహనం నుంచి రివాల్వర్ తీసుకొచ్చాడు.

కాల్చేస్తానంటూ బెదిరింపులు

తాను చెల్లించిన బిల్లు డబ్బులు తిరిగి ఇవ్వకపోతే కాల్చేస్తానంటూ సిబ్బందిని, కస్టమర్లను బెదిరించాడు. దీంతో భయాందోళనలకు గురైన వారు అక్కడి నుంచి పరుగులు తీశారు. బౌన్సర్లు యువకుడిని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పోలీసుల అదుపులో నిందితుడు

బార్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు మహ్మద్ షానవాజ్‌ను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద ఉన్న రివాల్వర్‌తో పాటు థార్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేటీఆర్ కుటుంబంపై ఎంపీ అర్వింద్ తీవ్ర ఆరోపణలు

నిజామాబాద్, ప్రజా వాయిస్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ కుటుంబ చరిత్ర హీనమైనదని విమర్శించిన ఆయన.. ఆ కుటుంబం దోపిడీలు, హత్యలకు పాల్పడిందని ఆరోపించారు. తనపై కూడా గతంలో హత్యాయత్నం జరిగిందని అర్వింద్ పేర్కొన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక గతంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

పాత వీడియోపై వివరణ

ముస్లిం మైనారిటీలతో తాను మాట్లాడిన పాత వీడియోను ప్రస్తుతం వైరల్ చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. 2024 ఎన్నికల సమయంలో ముస్లిం మైనారిటీలతో మాట్లాడిన సందర్భాన్ని ఆయన ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ముస్లింలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మద్దతు ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు.

ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం

అదే సమయంలో వారు తనకు ఓటు వేసినా, వేయకపోయినా నిజామాబాద్‌లో తానే విజయం సాధిస్తానని చెప్పినట్లు అర్వింద్ వివరించారు. అయితే, ఎవరికి ఓటు వేసినా బీజేపీనే గెలుస్తుందని తాను అన్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల వెనుక ఉన్న సందర్భాన్ని పక్కనపెట్టి పాత వీడియోను వైరల్ చేస్తున్నారని ఆరోపించారు.

బ్లూ డ్రమ్ హత్య కేసులో మరో కీలక మలుపు

- మరణశిక్షను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన ముస్కాన్, సాహిల్
- మీరట్ జిల్లా కోర్టు విధించిన ఉరిశిక్షపై అప్పీల్
- సాక్ష్యాలు పరిస్థితుల ఆధారంగానే ఉన్నాయన్న దోషులు
- భర్త సౌరభ్‌ను హత్య చేసి డ్రమ్‌లో మృతదేహం దాచినట్లు అభియోగాలు
- తీర్పును రద్దు చేయాలని అలహాబాద్ హైకోర్టుకు విజ్ఞప్తి
- వచ్చే వారం అప్పీల్‌పై విచారణ జరిగే అవకాశం

న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరణశిక్షకు గురైన మృతుడు సౌరభ్ రాజ్‌పుత్ భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా దిగువ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. మీరట్ జిల్లా కోర్టు విధించిన శిక్షను రద్దు చేయాలని కోరుతూ ఇద్దరూ సంయుక్తంగా అప్పీల్ దాఖలు చేసినట్లు సమాచారం.

సాక్ష్యాలపై దోషుల అభ్యంతరం

ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు పరిస్థితుల ఆధారంగా ఉన్నాయని, వాటిని దిగువ కోర్టు సరిగ్గా అంచనా వేయలేదని అప్పీల్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వాదనల ఆధారంగా తమకు విధించిన మరణశిక్షను రద్దు చేయాలని వారు హైకోర్టును కోరారు. అప్పీల్‌పై వచ్చే వారం డివిజన్ బెంచ్ విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వివాహేతర సంబంధమే హత్యకు కారణమా?

మీరట్‌కు చెందిన మర్చంట్ నేవీ ఉద్యోగి సౌరభ్ రాజ్‌పుత్‌కు, ముస్కాన్ రస్తోగీకి 2016లో వివాహమైంది. సౌరభ్ ఉద్యోగం మానేసిన తర్వాత దంపతుల మధ్య విభేదాలు మొదలైనట్లు కేసు వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో సౌరభ్ స్నేహితుడు సాహిల్ శుక్లాతో ముస్కాన్‌కు సంబంధం ఏర్పడినట్లు దర్యాప్తులో ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని పోలీసులు పేర్కొన్నారు.

మృతదేహాన్ని డ్రమ్‌లో దాచినట్లు ఆరోపణలు

దర్యాప్తు ప్రకారం.. సౌరభ్‌ను హత్య చేసేందుకు ముస్కాన్, సాహిల్ పథకం రచించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భోజనంలో నిద్రమాత్రలు కలిపి, ఆయన నిద్రలోకి జారుకున్న తర్వాత హత్య చేసినట్లు కేసులో ప్రాసిక్యూషన్ వాదించింది. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి ప్లాస్టిక్ డ్రమ్‌లో ఉంచి, సిమెంట్‌తో కప్పి పెట్టినట్లు ఆరోపించింది. ఆ తర్వాత ఇద్దరూ మనాలికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన

సౌరభ్ కనిపించకుండా పోవడంతో ఆయన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ముస్కాన్, సాహిల్‌పై అనుమానాలు రావడంతో విచారణ చేపట్టగా హత్యకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేసు విచారణ అనంతరం మీరట్ జిల్లా కోర్టు ఇద్దరినీ దోషులుగా నిర్ధారించి మరణశిక్ష విధించింది.ప్రస్తుతం ఆ తీర్పును సవాల్ చేస్తూ దోషులు హైకోర్టును ఆశ్రయించడంతో కేసు తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది. అప్పీల్‌పై హైకోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి.

‘ప్రజలకు బాసులం కాదు.. సేవకులం’

మొదటి పేజీ తరువాయి

కొనసాగించడమే ప్రజాప్రతినిధుల బాధ్యతని స్పష్టం చేశారు.

మహిళలకు రాజకీయాల్లో వివక్ష

‘మనం ప్రజలకు బాసులం కాదు.. సేవకులం’ అనే భావనతో నాయకులు పనిచేయాలని సీతక్క పిలుపునిచ్చారు. ప్రజలే నాయకులకు అసలైన బలమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతని పేర్కొన్నారు.రాజకీయాల్లో మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పటికీ వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుష మంత్రులకు లభించే గౌరవం మహిళా మంత్రులకు సమానంగా దక్కడం లేదని వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితులకు భయపడి వెనకడుగు వేయకుండా అంకితభావం, పట్టుదలతో ముందుకు సాగాలని మహిళా నాయకులకు సూచించారు.

తెలంగాణపై బీజేపీ హైకమాండ్ గురి

మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రులు కూడా రాష్ట్రంలో వరుసగా పర్యటించే అవకాశాలున్నాయి.

గ్రేటర్, ఖైరతాబాద్ ఎన్నికలపై గురి

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల ద్వారా పార్టీ బలాన్ని పెంచుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్న అంచనాలను అధిగమించి, ప్రజల దృష్టిని తమవైపు మళ్లించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరి వ్యూహం ఫలించేనో?

ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, మరోవైపు బీఆర్ఎస్ పునరుద్ధరణ ప్రయత్నాలు, ఇంకోవైపు బీజేపీ సంస్థాగత విస్తరణ.. తెలంగాణ రాజకీయాలను రానున్న రోజుల్లో మరింత వేడెక్కించనున్నాయి. అయితే, అగ్రనేతల పర్యటనలు, పార్టీ సమావేశాలు మాత్రమే ఎన్నికల విజయాన్ని నిర్ణయించలేవు. క్షేత్రస్థాయిలో నాయకత్వం, ప్రజా సమస్యలపై స్పందన, పార్టీ శ్రేణుల సమన్వయం కీలకం కానున్నాయి. బీజేపీ ప్రకటించనున్న కార్యాచరణ ఎంతవరకు ఫలిస్తుందో, ఇతర పార్టీలు ఎలా ప్రతిస్పందిస్తాయో వేచి చూడాలి.

ఆసుపత్రులకు కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

సమయంలో ఇలాంటి పునర్వినియోగం జరుగుతున్నట్లు సమాచారం అందిందని వెల్లడించినట్లు తెలుస్తోంది.

పూర్తి ధర వసూలు చేసి పాత పరికరాలా?

సూదులు, క్యాథెటర్లు, కొన్ని రకాల స్టెంట్లు, ఇంప్లాంట్లు, డిస్పోజబుల్ శస్త్రచికిత్స పరికరాలు వంటి వాటిని తయారీదారులు ఒక్క సారి వినియోగం కోసమే రూపొందిస్తారు. వాటిని తిరిగి ఉపయోగించడం వల్ల హెపటైటిస్, హెచ్ఐవీతో పాటు ఇతర బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాపించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోగుల నుంచి కొత్త పరికరానికి సంబంధించిన పూర్తి ధర వసూలు చేస్తూ, పాత పరికరాన్ని మళ్లీ వినియోగించ డం జరిగితే అది మరింత తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని వైద్య రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్రాల ఆరోగ్య శాఖ కార్యదర్శులకు కేంద్రం సూచించినట్లు సమాచారం. తెలంగాణలోనూ ఆసుపత్రుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ఆదేశాల అమలులో భాగంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది. వైద్య పరికరాల భద్రత, నాణ్యతపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

రోగులు అప్రమత్తంగా ఉండాలి

సింగిల్ యూజ్ పరికరాల పునర్వినియోగానికి సంబంధించిన నిబంధనలను ఉల్లంఘిస్తే, వర్తించే చట్టాల ప్రకారం లైసెన్స్‌పై చర్యలు, జరిమానాలు లేదా ఇతర చట్టపరమైన చర్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. రోగులు తమ చికిత్సలో ఉపయోగించే పరికరాల గురించి వైద్యులను అడిగి తెలుసుకోవాలని, అనుమానం కలిగితే ఆసుపత్రి యాజమాన్యాన్ని లేదా సంబంధిత ఆరోగ్య అధికారులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. రోగుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అన్ని ఆసుపత్రులు నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది.

సుమంత్‌కు కొండా సురేఖ బర్త్‌డే విషెస్

- 30 ఏళ్ల అనుబంధం
- కొడుకులా తోడుగా నిలిచాడంటూ ప్రశంసలు
- కష్టసుఖాల్లో కుటుంబానికి అండగా నిలిచాడని ప్రశంస
- భార్యతో కలిసి సురేఖ నివాసానికి వెళ్లిన సుమంత్
- దాడి, హత్యాయత్నం ఆరోపణల కేసుతో రాజకీయంగా చర్చ
- కేసు నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన సుమంత్

హైదరాబాద్, ప్రజా వాయిస్: మాజీ మంత్రి కొండా సురేఖ తన మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గత మూడు దశాబ్దాలుగా తమ కుటుంబంతో అనుబంధాన్ని కొనసాగిస్తూ.. ప్రతి కష్టసుఖంలోనూ కొడుకులా తోడుగా నిలిచాడని ప్రశంసించారు. సుమంత్ పుట్టినరోజు సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి.

30 ఏళ్ల అనుబంధం

తమ కుటుంబంతో సుమంత్‌కు మూడు దశాబ్దాలుగా విడదీయలేని అనుబంధం ఉందని కొండా సురేఖ పేర్కొన్నారు. కష్టకాలంలోనూ నిబద్ధత, నిజాయితీతో తమ వెన్నంటే నిలిచాడని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజాసేవలో భాగస్వామి అవుతున్నాడని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.పుట్టినరోజు సందర్భంగా సుమంత్ తన భార్యతో కలిసి కొండా సురేఖ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను కూడా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు.

దాడి కేసుతో చర్చ

ఇటీవల సుమంత్‌పై నమోదైన దాడి, హత్యాయత్నం ఆరోపణల కేసు నేపథ్యంలో ఈ శుభాకాంక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణ ఫిర్యాదు మేరకు 2026 ఆగస్టులో కేసు నమోదైంది. తనపై ఇనుప రాడ్లతో దాడి చేసి, బెదిరించడంతోపాటు రూ.10 కోట్లు డిమాండ్ చేశారని హరికృష్ణ ఆరోపించారు. ఈ ఆరోపణలను దర్యాప్తులో తేలాల్సిన అంశాలుగా చూడాల్సి ఉంది.

హైకోర్టును ఆశ్రయించిన సుమంత్

ఈ కేసులో తొలుత మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఘటన జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు కొందరిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ సుమంత్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 1న విచారణ సందర్భంగా తక్షణ రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించినట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయి.

నోటీసులిచ్చినా.. ఆగని అక్రమ నిర్మాణం

- కోదాడ పెద్ద చెరువు శిఖం భూమి ఆక్రమణపై ఆరోపణలు
- అధికారుల ఆదేశాలు బేఖాతర్ .. యథేచ్ఛగా పనులు
- అధికారుల తీరుపై మత్స్యకార సంఘం అనుమానాలు
- అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని డిమాండ్

ప్రజా వాయిస్,కోదాడ: చెరువు భూమి ఆక్రమణ.. అధికారుల నోటీసులు.. అయినా ఆగని నిర్మాణ పనులు! కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు శిఖం భూమిలో అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. నిర్మాణ పనులు నిలిపివేయాలని అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటిని బేఖాతర్ చేస్తూ పనులు కొనసాగిస్తున్నారని మత్స్యకార సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.పెద్ద చెరువు భూమిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు, మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు సంబంధిత వ్యక్తికి నోటీసులు అందజేసి పనులు నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అయినప్పటికీ నిర్మాణం కొనసాగుతుండటంపై అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.చెరువు భూమి ఆక్రమణతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గడమే కాకుండా, తమ జీవనోపాధికి విఘాతం కలుగుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చిన అధికారులు తదుపరి చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ కట్టడాన్ని తొలగించాలని మత్స్యకార సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే సబ్ ..ప్రభుత్వ భూమి కాపాడే బాధ్యత ఎవరిధి..!?

- ప్రభుత్వ భూమి అమ్మకానికి పెట్టింది రెవిన్యూ అధికారులా! కాంగ్రెస్ పార్టీ నేతలా?
- ప్రజా ప్రభుత్వ పాలనలో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని మింగిన ఘనుడు
- మణుగూరు రెవిన్యూ అధికారులకు కనుసైగల్లోనే ప్రభుత్వ భూమిలో బహిరంగ నిర్మాణాలు
- అధికారులకు రాజకీయ నేతలకు లక్షల రూపాయలు ముడుపులు అందినట్టు గుసగుసలు
- ఆర్టీవో కార్యాలయానికి కేటాయించిన స్థలం కబ్జా జరిగిన స్పందించలేని జిల్లా కలెక్టర్

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన అంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల పాలన చూస్తే.. అందరూ శాకాహారులే మరి రొయ్యల మూట ఏమైంది!? అనే సామెత నేడు ప్రజల్లో గట్టిగా వినిపిస్తుంది. ప్రజలకు ఉచిత పథకాలు ఇస్తామంటూ బహిరంగ సభల్లో తుపాకి రాముడి మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు. అధికారం రాగానే ప్రజలను మభ్యపెట్టి పాలను కొనసాగిస్తూ ఏజెన్సీ ప్రాంతాల్లో 170 యాక్ట్ కనుమరుగు చేసి అరాచక పాలన కొనసాగిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా. బహిరంగ దోపిడీలు, భౌతిక దాడులు, కబ్జాలు, చీకటి వ్యాపారాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బాగోతాలు, జరుగుతుంటే అవి ప్రశ్నించాలి అంటే మేధావులు కూడా ఈ కాంగ్రెస్ పార్టీ పాలనలో భయభ్రాంతులకు గురయ్యేది నేటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సాంప్రదాయంగానే మారినట్టు ప్రజల్లో విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం పినపాక నియోజకవర్గం అంటేనే. నేడు దోపిడీలకు ,కబ్జాలకు , ప్రశ్నిస్తే అధికార అహంకారంతో తుపాకి రాముడు మాటలకు అడ్డగా మారింది అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పై ప్రభుత్వ భూములు మాయం చేశారు అనే నిందలు వేసిన నాటి కాంగ్రెస్ నేతలే. నేడు ఖరీదైన ప్రభుత్వ భూములను దైవం పేరుతో ఆక్రమించుకుంటున్నట్లు మణుగూరు మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మణుగూరు పట్టణానికి శివారు ప్రాంతమైన గుట్ట మల్లారం గ్రామ సమీపంలో రైతు వేదిక పక్కనే ఉన్న సర్వే నెంబర్ 49 భూ విస్తరణ లో కొంత భూమిని గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ అధికారులు రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయ నిర్మాణానికి కేటాయించారు అనేది జగమెరిగిన సత్యమే!?. అయితే ప్రధాన రహదారి పక్కనే ఆ యొక్క భూమి కోట్ల రూపాయలు ధర పెలికే భూమి కావడంతో దానిపై కన్నేసిన కొంతమంది కబ్జా బడా బాబులు ప్రభుత్వ భూమిని ఎట్లగైన ఆక్రమించాలనే ఆలోచన చేశారు.అనే విమర్శలు గట్టిగానే ఉన్నాయి.దాంతో పక్క ప్లాన్ చేసిన కబ్జా దారుడు..దైవం పేరుతో హిందువుల నోరు మూపించే పక్క ప్లాన్ చెయ్యడం రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ భూమిలో అమ్మవారి గుడి కట్టడం, దానికి అడ్డు చెప్పకుండా రెవిన్యూ అధికారులకు మురుకులు అందించి వారితో చేతులు కలపడం. కారణంగానే నేడు ప్రధాన రహదారి పక్కనే గుడి నిర్మాణం జరుగుతున్నట్లు ప్రజలు బహిరంగ చర్చలు జరుపుతున్నారు. నిజానికి గుట్ట మల్లారం గ్రామ శివారు ప్రాంతంలో. రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయానికి కేటాయించిన ప్రదేశం పూర్వీకులు దహన కార్యక్రమాలు జరిపిన ప్రదేశం అది. అయినప్పటికీ అందులో అమ్మవారి గుడి కట్టడం. దానిపై అధికారులు మౌనం పాటించడం చూస్తుంటే , ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేవారు. దాంతో ఎట్లాగైనా ఖరీదైన ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని ఆలోచన చేసిన కాంగ్రెస్ నేతలు. మణుగూరు రెవిన్యూ అధికారులకు అంతర్గతంగా కోట్ల రూపాయలు లంచాలు ఇచ్చి కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్టు. గుట్ట మల్లారం గ్రామంలోని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నీళ్లు గా స్మశాన వాటిక ఉపయోగించే ప్రాంతం అందరికీ తెలిసిన విషయమైనా స్మశాన వాటిక పక్కన ఆదిశక్తి అమ్మవారి గుడి నిర్మాణానికి ఎలా ఉపయోగిస్తున్నారు అనేది హిందువులకు ప్రశ్నార్థకంగా మారింది. మరి ఇప్పటికైనా భద్రాచలం సబ్ కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు మణుగూరు తాసిల్దార్ అద్దంకి నరేష్ తక్షణమే స్పందించి.. ప్రధాన రహదారి పక్కనే ఉన్న కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని ఎట్లగైన కాపాడతారా?? లేదంటే ప్రజా ప్రభుత్వంలో అధికారం మాదే ఆక్రమించడం మా హక్కు అంటూ ప్రభుత్వ భూమిని కనుమరుగు చేస్తారా అనేది వేచి చూడాలి మరి

ప్రజల ప్రాణాలతో చెలగాటమా

- షాద్ నగర్ పరిశ్రమల కాలుష్యంతో షాబాద్ మండల ప్రజల విలవిల
- కలుషిత గాలితో బోడంపహాడ్ మరియు వరుస గ్రామాలు విపరీతంగా పెరుగుతున్న ఎలర్జీలు శ్వాసకోస సమస్యలు
- కాలుష్య పరిశ్రమలపై తక్షణమే విచారణ జరిపి తగిన చర్యలు కోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

(ప్రజా వాయిస్ షాబాద్)షాద్‌నగర్ నియోజకవర్గ సరిహద్దుల పరిధిలో వెలిసిన పారిశ్రామిక కంపెనీలు వెదజల్లుతున్న రసాయన కాలుష్యం వల్ల పొరుగునే ఉన్న చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలో నిబోడంపహాడ్ పరుస గ్రామాలు గ్రామాల మరియు ప్రజలు తీవ్ర అనారోగ్య పాలవుతున్నారు ముఖ్యంగా మరియు పరిసర గ్రామాల ప్రజలు గాలి కాలుష్యం కారణంగా తీవ్రమైన ఎలర్జీలు చర్మ రోగాలు, శ్వాసకోస సమస్యలు, కళ్ల మంటలతో తీవ్రంగా అల్లాడిపోతున్నారు పరిశ్రమల నుంచి పగలు కానీ రాత్రి వేళల్లో విడుదలవుతున్న పొగ, ఘాటైన రసాయన దుర్వాసనల వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్లలోనే ఉండలేని పరిస్థితి నెలకొంది. షాద్‌నగర్ పారిశ్రామిక ప్రాంత పరిధిలోని కంపెనీలు లాభాలు గడిస్తుంటే దానికి సరిహద్దుల్లో ఉన్న చేవెళ్ల నియోజకవర్గపు గ్రామాలు కాలుష్య భారంతో రోగాల బారిన పడటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గాలిలో విషపూరిత రసాయన ఉద్గారాల వల్ల చర్మ సంబంధిత ఎలర్జీలు దగ్గు, ఆయాసం పెరిగిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు ఒక నియోజకవర్గంలో ఉన్న కంపెనీల వల్ల పక్క నియోజకవర్గ మండల ప్రజలు దెబ్బతింటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తమవుతోంది తక్షణ గాలి నాణ్యత తనిఖీలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు షాబాద్ మండల సరిహద్దు గ్రామాల్లో గాలి నాణ్యతను శాస్త్రీయంగా పరీక్షించాలి పర్యావరణ నిబంధనలు పాటించని కాలుష్య నియంత్రణ పరికరాలు వాడని ఫ్యాక్టరీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

డ్యూటీకి డుమ్మా.. జీతాలకు మాత్రం ఢోకా లేదు.!

- యూనియన్ ముసుగులో విధులకు దూరం
- పాలసీల వ్యాపారాలు.. పర్యవేక్షణ అధికారులపై కమీషన్ల ఆరోపణలు
- విధులకు రాకున్నా హాజరు వేస్తున్నారంటూ విమర్శలు
- ప్రభుత్వ ఖజానాకు గండి.. కలెక్టర్ సారు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

ప్రజా వాయిస్,అనంతగిరి:ప్రజాసేవకు ఎగనామం.. జీతాల వసూళ్లకు మాత్రం వెనుకాడటం లేదు ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించాల్సిన కొందరు ఉద్యోగులు యూనియన్ కార్యకలాపాలు, హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల వ్యాపారాలు, విహారయాత్రల పేరుతో విధులకు దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన మండల స్థాయి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కమీషన్లు ఇస్తే చాలు.. హాజరు ఉన్నట్టేనా.?

విధులకు గైర్హాజరయ్యే కొందరు ఉద్యోగులకు అధికారులు సహకరిస్తూ, హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేయించి పూర్తి వేతనాలు అందేలా చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కమీషన్లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రజలకు తప్పని ఎదురుచూపులు

కార్యాలయాలకు వచ్చే రైతులు, వృద్ధులు తమ పనుల కోసం గంటల తరబడి వేచి చూసినా సంబంధిత ఉద్యోగులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల గైర్హాజరుతో ప్రజా సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందని వాపోతున్నారు. మరోవైపు, విధులకు హాజరుకాకుండానే వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఖజానాపై భారం పడే ప్రమాదం ఉంది.

కలెక్టర్ సారు జోక్యం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులతో పాటు, అక్రమాలకు సహకరించినట్లు తేలిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాల పరిశ్రమతో పరిసర వాసల ప్రాణాలకు ముప్పు

- దుమ్ము, ధూళి కాలుష్య నియమావళిని ఉల్లంఘిస్తూ, ప్రాంతం వాసులకు ప్రాణాంతకంగా విద్యుత్ స్తంభాల పరిశ్రమ నిర్వహిస్తున్నారు

ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలోని 12వ వార్డు పగిడిపల్లి సమీపంలో విద్యుత్ స్తంభాల పరిశ్రమ నిర్వహణ పరిశ్రమ వెదజల్లుతున్న విషతుల్యంగా మారింది. ధూళి ప్రభావంతో పరిసర వ్యవసాయ పంటలపై ప్రభావం చూపుతుంది అని ,రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా,పరిసరాలలో ఉన్నటు వంటి కార్యాలయాలకు, గ్రామస్తులకు అనునిత్యం వెదజల్లుతున్న ధూళి ఊపిరితిత్తుల వ్యాధులతో అవస్థలు పడుతున్నారు, అనే అంశం ప్రధానమైంది. కంపెనీ యాజమాన్యం కోట్లు గడిస్తున్నారు కనీస నియమావళి, నిబంధనలు పాటించకుండా అంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యంగా ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందిన యువతతో వెట్టిచాకిరి చేయించుకుంటూ, ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నారు అని ప్రచారం ఉంది. సంబంధిత ప్రభుత్వ అధికార యంత్రాంగం నాయకులు పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ పరిశ్రమపై విచారణ కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు స్థానిక ప్రజలు.

ఏకంగా వాగునే కబ్జా చేస్తున్నారా!

- సిద్దులూరు వద్ద వాగు పక్కన భారీగా మట్టి పోతలు
- యంత్రాలతో పనులు- కళ్లముందే జరుగుతున్నా అధికారుల మౌనం ఎందుకు?

ప్రజావాయిస్/వికారాబాద్: వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వాగు కాలువ ఆక్రమణకు గురవుతోందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వాగు పక్కన పెద్దఎత్తున మట్టిని పోయడం, భూమిని చదును చేస్తున్నట్లు కనిపిస్తున్న దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. వాగు సహజ ప్రవాహ మార్గానికి ముప్పు వాటిల్లుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వాగు పక్కన మట్టి పోతలు.. యంత్రాలతో పనులు!

సిద్దులూరు సమీపంలోని వాగు బ్రిడ్జి వద్ద ఒకవైపు నీటి ప్రవాహం కనిపిస్తుండగా, మరోవైపు భారీగా మట్టి పోసిన ఆనవాళ్లు, భూమిని చదును చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అక్కడ యంత్రాలతో పనులు జరుగుతున్నట్లు ఫొటోలు సూచిస్తున్నాయి. ఈ పనులు వాగు పరిధిలోకి వస్తున్నాయా? ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందా? లేక అనుమతులతోనే పనులు చేపడుతున్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ప్రధాన రహదారికి సమీపంలోనే ఈ పనులు జరుగుతున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. వాగు హద్దులను నిర్ధారించి, రెవెన్యూ రికార్డులు పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనులకు అనుమతులు ఉన్నాయో లేదో తేల్చాల్సిన అవసరం ఉంది. ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలపై అధికారులు స్పందించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.

వర్షాకాలంలో ముప్పు తప్పదా?

వాగుల సహజ ప్రవాహ మార్గాలు కుంచించుకుపోతే వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉంది. మట్టి పోతల వల్ల నీటి ప్రవాహ మార్గం ప్రభావితమైతే పరిసర ప్రాంతాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల అధికారులు ముందస్తుగా స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలి!

సిద్దులూరు సమీపంలోని వాగు కాలువ హద్దులను అధికార యంత్రాంగం తక్షణమే పరిశీలించి, ప్రభుత్వ భూమి లేదా వాగు పరిధిలో అక్రమ పనులు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వాగు సహజ స్వరూపం దెబ్బతినకుండా పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.ఇంతకీ అక్కడ జరుగుతున్నది సాధారణ మట్టి పనులా? లేక వాగు భూమిని ఆక్రమించే ప్రయత్నమా? అధికారుల క్షేత్రస్థాయి విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

కోట్లు ఖర్చు.. ప్రారంభోత్సవానికే పరిమితమైన 'బాహుబలి' లైట్లు

- అంధకారంలో జైపూర్
- ప్రజాధనం వృథా
- పట్టించుకునే నాథుడే లేడు
- బస్టాండ్ లో చీకటి.. ఎక్స్ రోడ్ లో చీకటి
- జైపూర్ లో ఎక్కడ చూసినా చీకటే
- పట్టించుకునే అధికారి లేడా? పలకరించే నాయకుడు లేడా?
- రాజకీయ కోణమా? అధికారుల వైఫల్యమా
- లక్షల ఖర్చు బూడిద..
- జైపూర్ ను చీకటిమయం చేసిన మీ అలసత్వం
- జైపూర్ లో అంధకారంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ.
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



జైపూర్ ప్రజా వాయిస్ : లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైటింగ్ వ్యవస్థ జైపూర్ మండల కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఉన్నా లేనట్లుగా తయారై, రాత్రి వేళల్లో జైపూర్ ను చీకటిమయం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జైపూర్ ప్రధాన కూడలి, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎంతో ఆర్భాటంగా, కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన భారీ 'బాహుబలి' హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన కొద్దిరోజులకే మూలనపడ్డాయి. ప్రస్తుతం అవి వెలుగునివ్వడం మానేసి కేవలం అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.అదే పరిస్థితి సెంట్రల్ లైటింగ్ విషయంలోనూ నెలకొంది. చెన్నూర్ ప్రధాన రహదారి, ఇందారం ఎక్స్ రోడ్, బస్టాండ్ వరకు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు నెలల తరబడి వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో ఈ ప్రధాన రహదారులన్నీ అంధకారంలో మగ్గుతున్నాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు.
రాజకీయ కోణమా? నిర్వహణ వైఫల్యమా? గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినందుకే కావాలని ఈ లైట్లను పట్టించుకోవడం లేదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విద్యుత్ బిల్లుల భారం తప్పించుకునేందుకో, లేక నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కాంట్రాక్టర్ల, అధికారుల నిర్లక్ష్యం వల్లనో ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడెక్కడ లైట్లు పాడయ్యాయి, వైరింగ్ సమస్య ఏంటి అని కనీసం పరిశీలించే దిక్కే లేదు. లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన లైట్లు ఇలా నిరుపయోగంగా మారడం ప్రజాధనం వృథా చేయడమేనని, ఇది పాలనా వైఫల్యానికి నిదర్శనమని జైపూర్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, బాహుబలి, సెంట్రల్ లైట్లను పునరుద్ధరించి జైపూర్ కు వెలుగులు నింపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చేతికొచ్చిన చెరుకు పంట బుగ్గిపాలు

- రైతుకు రూ.5 లక్షలకు పైగా నష్టం
- విద్యుత్ షాక్ తో మూడు ఎకరాల చెరుకు పంట దగ్ధం
- ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్న బాధిత రైతు పెంటారెడ్డి.
- మంటలను అదుపులోకి తీసుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది.

ప్రజా వాయిస్ / జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని బూర్దిపాడ్ గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో రైతు పెంటారెడ్డికి చెందిన మూడు ఎకరాల చెరుకు పంట కాలిపోయింది. విద్యుత్ షాక్ కారణంగా మంటలు చెలరేగడంతో చేతికొచ్చిన సుమారు 150 టన్నుల చెరుకుతో పాటు డ్రిప్ పైపులు, ఇతర వ్యవసాయ పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే చెరుకు పంటలో అధిక భాగం కాలిపోయింది. మరో 15 రోజుల్లో చక్కెర కర్మాగారాలు ప్రారంభమై చెరుకు తరలింపు మొదలుకానున్న నేపథ్యంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలిపోవడంతో రైతు పెంటారెడ్డి ఆవేదనకు గురయ్యాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

షార్ట్ సర్క్యూట్‌తో చర్చి బుగ్గిపాలు

- కొత్త చర్చి నిర్మాణానికి సహాయం చేస్తా
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ప్రజా వాయిస్ / మోమిన్ పేట్: వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం వెల్చాల్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం రాత్రి సెవెంత్ డే చర్చి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.విషయం తెలుసుకున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్చిని సందర్శించి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. నూతన చర్చి నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అంజయ్య, సీఐ వెంకట్, ఎస్సై భరత్ భూషణ్, తహసీల్దార్ మునిరొద్దీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి

- నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు.
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- ఆస్తులు కోల్పోయిన వారికి వారం రోజుల్లోగా పరిహారం చెల్లించేలా చర్యలు
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్
- జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులతో కలిసి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజావాయిస్ / వికారాబాద్ బ్యూరో: వికారాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ రోడ్డు పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు కలగకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో రాకపోకలు సులభతరమవడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వారం రోజుల్లో పరిహారం

ఫ్లైఓవర్ రోడ్డు నిర్మాణానికి సహకరించి ఆస్తులు కోల్పోయిన వారికి వారం రోజుల్లోగా నష్టపరిహారం చెల్లించేలా తగిన చర్యలు చేపట్టినట్లు సభాపతి తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసు చంద్ర, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

- పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- ప్రతి ప్రమాద కేసును ఈ-డీఏఆర్ పోర్టల్ లో నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు ఆదేశాలు

ప్రజా వాయిస్ పెద్దపల్లి రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం కింద అర్హులైన బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. పథకం అమలుపై రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐడీఓసీ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్ లో వైద్యం కీలకం

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే, ముఖ్యంగా గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని సీఎస్ పేర్కొన్నారు. చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా బాధితులను సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్యం అందించాలని సూచించారు. పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. పథకం కింద నిర్దేశించిన పరిమితి దాటిన తర్వాత కూడా బాధితులకు వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించాలని సూచించారు.

ప్రతి ప్రమాద కేసు ఆన్ లైన్ లో నమోదు చేయాలి

పథకం అమలుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాద కేసులను టీఎంఎస్ 2.0 పోర్టల్‌తో పాటు ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ-డీఏఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు నమోదైన కేసులకు సంబంధించి ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు త్వరితగతిన పరిశీలించి ఆమోదించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని తెలిపారు. జిల్లాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, వైద్య సేవలు, పెండింగ్ క్లెయిమ్‌లు, ఆసుపత్రులకు నిధుల విడుదలపై సమీక్షించాలని సూచించారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు సకాలంలో చికిత్స అందేలా చూడాలని స్పష్టం చేశారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ ఎడమ కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

- దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల వాంగ్మూలం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం రూరల్ ఎస్ఐ. ఉప్పు నాగేష్.

ప్రజా వాయిస్,మిర్యాలగూడ. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గయ్య తండా శివారు ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడిని మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంటకు చెందిన ఆలేటి వీరబాబు (48)గా పోలీసులు గుర్తించారు.మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ఉప్పు నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిరీత్యా బార్బర్ అయిన వీరబాబు గత కొంతకాలంగా వెరికోస్ వెయిన్స్‌తో పాటు చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని,సుమారు ఆరేళ్ల క్రితం వెరికోస్ వెయిన్స్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ, తిరిగి అదే సమస్య తలెత్తడంతో తరచూ అనారోగ్య బాధలు అనుభవిస్తూ మనస్తాపానికి గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.ఈ నెల 24న ఉదయం సుమారు 9 గంటలకు పని నిమిత్తం సింధు సెలూన్‌కు వెళ్లిన వీరబాబు తిరిగి ఇంటికి రాలేదని, అదే సమయంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో మృతదేహం కొట్టుకొస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీస్, సిబ్బంది స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశామని, అనంతరం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు.అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వీరబాబుదిగా గుర్తించారని తెలిపారు.దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై వీరబాబు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తమ వాంగ్మూలంలో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. మృతుడి మరణంపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని వారు వెల్లడించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ ఉప్పు నగేష్ పేర్కొన్నారు.

అందోల్ బీఆర్ఎస్ లో ముసలం

- మాజీ ఎమ్మెల్యేది ఒక దారి
- మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ది మరో దారి
- అసెంబ్లీ పునర్విభజన జరిగితే తనికె టికెట్ అంటూ బిక్షపతి
- మాజీ జడ్పీ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి సైతం ప్రయత్నం
- అయోమయంలో బీఆర్ఎస్ క్యాడర్
- మాజీ ఎమ్మెల్యే కార్యక్రమాలకు బిక్షపతి అనుచరులు దూరం

ప్రజా వాయిస్ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల అనంతరం బలపడుతుంది. కార్యకర్తలు కూడా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ కోతలకు నిరసనగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తో పాటు పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, మాసాన్ పల్లి నారాయణ తదితరులు పాల్గొన్న విషయం తెలిసిందే. ఇదే సందర్భంలో రాష్ట్ర బ్రేవరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ రాష్ట్ర స్థాయి నాయకులతో కలిసి పనిచేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం కేటీఆర్ కు అత్యత సన్నిహితులుగా ఉన్న బిక్షపతి 2029 అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గం పునర్విభజనలో విభాగంగా ఎస్సీ రిజర్వ్ కాకుండా జనరల్ స్థానం అయితుందన్న ఊహాగానాలు రావడంతో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు బిక్షపతి అధిష్టానం నుంచి మద్దతు పలికేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ఇదే సందర్భంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాత్రం ఏమైనా రాష్ట్ర పార్టీ ఇచ్చిన ఆదేశాల వివిధ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మఠం బిక్షపతి ఏ ఒక్క ప్రాంతంలో కూడా పాల్గొనలేదు. ఆయన కాదు ఆయనకు సంబంధించిన అనుచరులు కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కల్వకుంట్ల కవిత కు సన్నితుడిగా ఉన్న బిక్షపతి ఆమె సొంత పార్టీ పెట్టినప్పటికీ బిక్షపతి ఆ పార్టీలోకి వెళ్తారు అన్న ప్రచారం అప్పట్లో జరిగింది. తాను బి ఆర్ఎస్ లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. తాజాగా దసరా సందర్భంగా రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను తెలంగాణ భవన్లో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గం సంబంధించిన రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్పై పూర్తి వ్యతిరేకత ప్రజల్లో ఉంది అన్నది స్పష్టం. దీని ప్రతిపక్ష బి ఆర్ ఎస్ పార్టీ మాత్రం ప్రజలు అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను తమవైపు మలుచుకునే పనిలో విజయం సాధిస్తే వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే అవకాశం ఉందని చెప్పవచ్చు. గ్రూపులుగా విడిపోతే అది పార్టీకి నష్టం కలిగే అవకాశం లేకపోలేదు.

మహిళలకు వాష్‌రూమ్ కరువు.. వాహనాలకు డ్యామేజ్ భయం!

- విగ్నేశ్వర పెట్రోల్ బంకులో నిబంధనలు గాలికొదిలేశారా?

ప్రజా వాయిస్/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలోని నాగిరెడ్డిపల్లి రోడ్ లో ఉన్న విగ్నేశ్వర పెట్రోల్ బంక్ నిర్వహణపై పలు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోల్ బంకుల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, వినియోగదారుల సౌకర్యాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మహిళలకు వాష్‌రూమ్ సౌకర్యం ఎక్కడ?పెట్రోల్ బంకుకు వచ్చే మహిళల కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉండాల్సిన వాష్‌రూమ్ సౌకర్యం సక్రమంగా లేదని ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా, మహిళల కోసం ఏర్పాటు చేసిన బాత్రూం ప్రదేశాన్ని పెయింట్ డబ్బాలు తదితర సామగ్రిని నిల్వ చేసే స్టోరేజ్ ప్రాంతంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంకు చుట్టూ ఇనుప కడ్డీలు.. వాహనదారులకు ఇబ్బందులుబంకు పరిసరాల్లో ఇనుప కడ్డీలు, రాడ్లు, స్తంభాలను ఏర్పాటు చేయడంతో వాహనాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని కార్లు డ్యామేజ్ అయినట్లు స్థానికులు చెబుతున్నారు.ఒకవైపు ఇనుప రాడ్లు, మరోవైపు భారీ వాహనాలు, మధ్యలో టిప్పర్లను నిలిపివేయడంతో బంకులోకి వచ్చి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.ట్రాన్స్‌ఫార్మర్ వద్ద భద్రతపై ప్రశ్నలుబంకు పరిసరాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకున్నారా? లేదా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగించే ప్రాంతంలో విద్యుత్ పరికరాల భద్రతపై అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఉన్నాయా?పెట్రోల్ బంక్ వంటి అత్యంత ప్రమాదకర ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా సామగ్రి అందుబాటులో ఉండాల్సి ఉండగా, ఫైర్ సేఫ్టీ కోసం అవసరమైన నీటి బకెట్లు తదితర ఏర్పాట్లు కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల భద్రత కంటే ఇనుప స్తంభాలకే ప్రాధాన్యతా?వాహనాలకు నష్టం కలగకుండా ఏర్పాటు చేసినట్లు చెబుతున్న ఇనుప కడ్డీలు, రాడ్లు, స్తంభాలే వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.వాహనాల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఏర్పాట్లు ప్రజలకే ప్రమాదంగా మారితే బాధ్యత ఎవరిది? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అధికారుల తనిఖీలు ఎక్కడ?విగ్నేశ్వర పెట్రోల్ బంక్ ప్రభుత్వ నిబంధనలు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు, వినియోగదారుల సౌకర్యాలకు సంబంధించిన ప్రమాణాల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా? అనే అంశంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.పెట్రోల్ బంక్‌లోని భద్రతా ఏర్పాట్లు, మహిళల వాష్‌రూమ్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లు, వాహనాల రాకపోకలకు ఉన్న సౌకర్యాలు తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యమా? లేక బంకు నిర్వహణ సౌకర్యాలే ముఖ్యమా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ప్రతిభకు ప్రశంసలు

- పోలీసులు, న్యాయవాదులకు ప్రశంసాపత్రాలు అందజేసిన సీనియర్ జడ్జి సురేష్

ప్రజా వాయిస్,కోదాడ:లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, న్యాయవాదులకు కోదాడ కోర్టు సీనియర్ జడ్జి సురేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేసిన వారిని శనివారం అభినందించారు.ఈ సందర్భంగా జడ్జి సురేష్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ల ద్వారా రాజీమార్గంలో కేసులు పరిష్కారమై కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు. సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు. పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేసి మరిన్ని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కేసుల పరిష్కారంలో కీలకపాత్ర పోషించిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కోదాడ టౌన్ సీఐ శివశంకర్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డితో పాటు కోదాడ టౌన్, రూరల్, అనంతగిరి, మునగాల, నడిగూడెం, చిలుకూరు, మోతే పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్, న్యాయవాదులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రెండు పదవుల పేరుతో లక్షల రూపాయలు మింగిన గ్రామ సర్పంచ్!??

- పేరుకే భార్య సర్పంచ్... పెత్తనం అంత తన బర్తదే !?
- పది రూపాయలు ఖర్చు చేస్తే వెయ్యి రూపాయల బిల్లులు
- మండల అధికారులకు కనుసైగల్లోనే ప్రజాధనం దుర్వినియోగం...!?
- రాముసుజవరం సర్పంచ్ అవినీతి బాగోతాలు బయటపెట్టిన వార్డు మెంబర్లు
- మెజార్టీ సభ్యులు ఆవేదన తెలిపిన పట్టించుకోని జిల్లా పంచాయతీ శాఖ అధికారి
- మీడియా నిజాలు బయటపెట్టిన మౌనం వీడని (సిపిఐ) కాంగ్రెస్ పార్టీ రాజకీయ నేతలు
- జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలంటూ పదకొండు మంది వార్డు మెంబర్లు వినతి

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలో గల రామనుజవరం గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రస్థాయి నేత కీర్తిశేషులు బొల్లోజు అయోధ్య చారి ప్రియ శిష్యుడు అయినటువంటి మాజీ సర్పంచ్ అవినీతి బాగోతం లక్షల సంఖ్యలో బయటపడింది. అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుంది. గతం పది సంవత్సరాలు సర్పంచి విధులు నిర్వహించిన బాడిస సతీష్. అనే వ్యక్తి తన పాలనలో బారి స్థాయిలోనే ప్రజాధనం దుర్వినియోగం చేశాడనే విమర్శలు ఉన్నప్పటికీ. మరోసారి సర్పంచ్ పదవి కావాలని ఆశించారు. దానికోసం ఎదురు చూపులు చూశారు అనేది జగమెరిగిన సత్యమే.? అయితే పంచాయతీ ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్ రావడం చూసిన బాడిష సతీష్. తన సతీమణి విద్యా వంతురాలు కావడంతో కలం కల్పన అనే మహిళను సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దింపాలి అంటూ కమ్యూనిస్టు పెద్దలను అంతర్గత ఒప్పందాలతో ఒప్పించినట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేతుల్లో అధికారం ఉండడం వలన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల ను మద్దతు కోరారు. తదుపరి సిపిఐ పార్టీ కాంగ్రెస్ పార్టీ పొత్తులతో పంచాయతీ ఎన్నికల బరిలో కలం కల్పన అనే మహిళ దిగినారు అనేది అందరికీ తెలిసిన విషయమే. రామనుజవారం గ్రామపంచాయతీలో 56 ఓట్లతో గెలిచిన కలం కల్పన అనే సర్పంచ్. అప్పటికే గిరిజన సొసైటీ అధ్యక్షురాలు పదవి అనుభవిస్తూ ఆ పదవికి రాజీనామా చేయకుండానే!. పంచాయతీ సర్పంచ్ పదవికి ప్రమాణ స్వీకారం చేసింది?. దాంతో నిజాలు నిర్భయంగా బయటపెట్టే ప్రజా వాయిస్ మీడియా ప్రతినిధి రామానుజవరం గ్రామంలో రెండు పదవులు అనుభవిస్తున్నట్లు వార్తలు రాసినారు .రెండు పదవులు అనుభవిస్తూ బహిరంగ దోపిడీ చేస్తున్నట్లు ప్రజలకు వివరించారు. అయితే అధికార పార్టీ కాంగ్రెస్ వర్సెస్ సిపిఐ పార్టీ (సర్పంచ్)కలం కల్పన కావడంతో అధికారులు లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగినప్పటికీ నోరు విప్పక పోవడం వలన నేడు తలలు బాదుకునే పరిస్థితి వచ్చింది. నిజానికి మణుగూరు మండల పంచాయతీ శాఖ అధికారులు కనుసైగల్లోనే నేడు లక్షల రూపాయలు దుర్వినియోగం జరుగుతున్నట్లు. గ్రామంలో ప్రజల ఓట్లతో గెలిచిన వార్డు నెంబర్లు పదకొండు మంది సభ్యులు. ఆందోళన చేయడం సర్పంచ్ అవినీతి బాగోతం. బయట పెట్టడం జిల్లాలోనే సంచలనం సృష్టిస్తుంది... వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు మండల పరిధిలో గల రామానుజ వారం గ్రామపంచాయతీలో పన్నెడు వార్డులకు ఎన్నికలు జరిగాయి ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఐ పార్టీ (1) కాంగ్రెస్ పార్టీ (5) బిఆర్ఎస్ పార్టీ (2) బిజెపి పార్టీ (4) స్థానాలు గెలిచినప్పటికీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన కలం కల్పనకు సర్పంచి పదవి దక్కింది?. కాంగ్రెస్ పార్టీ కోడారీ రాణి కి ఉప సర్పంచ్ ఎన్నికయ్యారు. దాంతో అదే అదునుగా భావించిన మాజీ సర్పంచ్, భార్యది పదవి భర్తది పెత్తనం అన్నట్లు కొనసాగడం. రెండు పదవుల అహంకారంతో పది రూపాయలు ఖర్చు చేస్తే 10,00 రూపాయల బిల్లు రాయడం పంచాయతీ తీర్మానాల్లో ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై భౌతికంగా దాడులు చేసే ప్రయత్నం చేయడం. ప్రశ్నించిన మహిళలను పచ్చి బూతులు తిట్టడం. గిరిజన సొసైటీ చైర్మన్ పదవి భార్యకు ఉండడంతో. గ్రామపంచాయతీ అభివృద్ధి పేరుతో. గ్రామంలోకి వచ్చే లారీల వద్ద పైసలు వసూలు చేయడం, అడ్డదారిలో వచ్చిన ప్రతి రూపాయి దౌర్జన్యంగా వాడుకోవడం చేయడంతో గ్రామంలో గెలిచిన 11 మంది వార్డు సభ్యులు ఒక్కసారిగా ఆందోళన చేపట్టారు. మీరు చేసే ఖర్చు ఏమిటి? మీరు రాసిన బిల్లులు ఏమిటి? ఎందుకు పాలకవర్గంలో ఈ బిల్లులు పెట్టారు? ప్రభుత్వ నిధులు ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారు అంటూ నిలదీశారు. దాంతో రెచ్చిపోయిన సర్పంచ్ భర్త. కార్యాలయంలో హల్ చల్ చేయడం. మహిళా వార్డు మెంబర్లను బూతులు తిట్టడం చేశారు అంటూ 11 మంది వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 లక్షలు రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీని కాపాడండి అంటూ. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందించారు. పంచాయతీ నిధులు కాపాడండి అంటూ జిల్లా పంచాయతీ శాఖ అధికారికి ఆవేదన తెలిపారు. ఇంత జరిగిన గ్రామపంచాయతీ నిధులపై ఎంక్వయిరీ జరగకపోవడం. పై ప్రజలకు పలు అనుమానాలు కలుగుతున్నాయి మరి ఇప్పటికైనా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పంచాయతీ శాఖ అధికారి డిపిఓ తక్షణమే స్పందించి రామానుజవరం గ్రామపంచాయతీలో. జరిగిన అవినీతి బాగోతం నిర్ధారణ చేస్తారా లేదంటే. కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ పార్టీ నేతల కనుసైగల్లో మౌనం పాటిస్తారా అనేది వేచి చూడాలి మరి...

ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ సమరశంఖం

- ఎమ్మెల్సీ ఓటరు నమోదును వేగవంతం చేయాలి
- సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి:
- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

ప్రజా వాయిస్,నల్లగొండ. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం గురించి వివరించాలని సూచించారు. నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులెవరూ నమోదు నుంచి దూరం కాకుండా చూడాలన్నారు. యువత, నిరుద్యోగ పట్టభద్రులతో మమేకమై వారి సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, ఈ అంశంపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఓటరు నమోదు కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టభద్రులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం అనుప రెడ్డి, పాదూరి శ్రీనివాస్ రెడ్డి, గంగుల సైదులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఆర్టీఏ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిడి కార్తీక్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాదం అనిల్, ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

45 రోజుల్లో రైస్ మిల్లర్ల బకాయిలు చెల్లించాలి

- చెల్లించకపోతే ఆస్తుల జప్తు..
- వచ్చే సీజన్ లో బియ్యం కేటాయింపులు నిలిపివేత
- జిల్లా కలెక్టరేట్ లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శశిధర్ రాజు..

ప్రజా వాయిస్ పెద్దపల్లిప్రభుత్వానికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను 45 రోజుల్లోగా పూర్తిగా చెల్లించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. బకాయిలు చెల్లించని వారిపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శశిధర్ రాజుతో కలిసి 15 మంది డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో బకాయిల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 17 ప్రకారం బకాయిల చెల్లింపునకు 45 రోజుల గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఈ గడువులోగా నగదు రూపంలో బకాయిలు చెల్లించాలని లేదా వాటికి సమానమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. గడువులోగా బకాయిలు పూర్తిగా చెల్లించని మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. అలాగే, రాబోయే సీజన్‌లో బియ్యం కేటాయింపులు పొందాలంటే డిఫాల్ట్ మిల్లర్లు ముందుగా తమ పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భైంసా బస్టాండ్ లో సమస్యల తిష్ట

- అపరిశుభ్రతతో ప్రయాణికుల అవస్థలు.. పట్టించుకోని అధికారులు

!భైంసా, ప్రజా వాయిస్

.నిర్మల్ జిల్లా భైంసా బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండ్‌లో అపరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ లోపం, హోటళ్ల పరిసరాల్లో పందుల సంచారం, బస్సుల రాకపోకల్లో జాప్యం ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు ఆదాయంపై చూపుతున్న శ్రద్ధ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మరుగుదొడ్ల నిర్వహణ గాలికి..

బస్టాండ్‌లోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, నీటి సరఫరా సమస్యలతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు అవస్థలు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారు కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హోటళ్ల వద్ద పందుల సంచారం

బస్టాండ్ ఆవరణలోని హోటళ్లు, తినుబండారాల దుకాణాల పరిసరాల్లో మురుగునీరు నిలిచిపోవడం, పందులు సంచరిస్తుండటం పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతోంది. ఆహార పదార్థాలు విక్రయించే ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొనడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బస్సుల కోసం పడిగాపులు

బస్సులు నిర్ణీత సమయానికి అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రాకపోకల్లో జాప్యంతో కొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు.

మహాలక్ష్మి పథకం అమలులో ఇక్కట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం అమలులోనూ కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళా ప్రయాణికులు పేర్కొంటున్నారు. రద్దీ కారణంగా బస్సులు ఆగకపోవడం, కొన్ని ప్రాంతాల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి రావడం తమకు ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి

భైంసా బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నిరంతర నీటి సరఫరా కల్పించాలని, పందుల సంచారాన్ని అరికట్టాలని, బస్సుల రాకపోకల్లో సమయపాలన పాటించాలని కోరుతున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం

- డీఎస్పీ రవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- రక్తదానం ప్రాణదానంతో సమానం
- అమరవీరులకు ఘన నివాళులు
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్

ప్రజా వాయిస్, మిర్యాలగూడ: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మిర్యాలగూడ డీఎస్పీ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. రక్తదానం ఎంతో విలువైనదని, ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, రక్తదానం ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెంపొందుతాయని తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన దాతలను అభినందించారు.ఈ శిబిరంలో లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, పలువురు రక్తదాతలు, పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ పోలీస్ అధికారులు, సీఐలు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డీజే మోతకు కూలిన స్లాబ్ పెచ్చులు

- నిద్రిస్తున్న కుటుంబంపై పడిన శిథిలాలు
- ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు
- పెద్దకోడూరులో ఘటన.. కరీంనగర్ కు తరలింపు

ప్రజా వాయిస్,చిన్నకోడూరు: డీజే సౌండ్ మోతకు పాత ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పెచ్చులు కూలి నిద్రిస్తున్న కుటుంబంపై పడిన ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం పెద్దకోదూరులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.బాధితుడు కొనింటి శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. దేవీ నవరాత్రుల సందర్భంగా గ్రామంలో దుర్గామాత నిమజ్జనం నిర్వహిస్తుండగా డీజే సౌండ్ మోగించారు. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న శ్రీహరి భార్య పల్లవి, కుమారుడు మనస్వీత్, కుమార్తెలు వివేక, స్వాతిపై పాత ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పెచ్చులు కూలి పడ్డాయి. దీంతో మనస్వీత్, వివేకకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత అంతంత మాత్రమేనా,,??

- ఫ్యాక్టరీస్ ఇన్ స్పెక్టర్లు, డైరెక్టర్ల ఖాళీలను భర్తీ చేసేదెప్పుడు
- కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలు
- సరాక, సిగాచి ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిగేనా,,?
- పరిశ్రమల యాజమాన్యం కార్మికుల హక్కులను కాపాడాలి

పటాన్‌చెరువు ప్రజావాయిస్ పటాన్చెరువు నియోజకవర్గం లో పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న వరుస ప్రమాదాలపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఫార్మా, రసాయన పరిశ్రమల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై ప్రభుత్వ యంత్రాంగం, ఫ్యాక్టరీస్, లేబర్ శాఖల నిర్లక్ష్య కంపెనీ యాజమాన్యాల పట్ల వైఖరిపై వివిధ పరిశ్రమల పని చేస్తున్న కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు పూర్తి రక్షణతో కూడిన పని దినాలు కల్పించాలని వేడుకుంటున్నారు

కార్మికుల ప్రాణాలకు భరోసా ఏది?

ఇటీవల సరాక లాబొరేటరీస్‌లో చోటుచేసుకున్న క్లోరోఫార్మ్ లీకేజీ ప్రమాదం, గతంలో పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదాలను ప్రస్తావిస్తూ పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు . సరాక లాబొరేటరీస్‌లో క్లోరోఫార్మ్ లీకై ఇద్దరు కార్మికులు మరణించగా, మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు భోపాల్ గ్యాస్ దుర్ఘటనను తలపించే స్థాయిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. సిగాచి, సరాక, గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతాల్లో ఫైర్ సేఫ్టీ లోపాలు, అనుమతులకు మించి ఉత్పత్తి, రియాక్టర్ల పేలుళ్లు వంటి ఘటనలు పునరావృతమవుతున్నా ఫ్యాక్టరీస్ శాఖ తనిఖీలు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు

ఖాళీ పోస్టులతో పర్యవేక్షణ ఎలా?

ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకటైన పటాన్చెరువు నియోజకవర్గం ఇక్కడ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్‌లో . డైరెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది కొరత కారణంగా పరిశ్రమల పర్యవేక్షణ బలహీనపడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కంపెనీ యాజమాన్యాలు కార్మికుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫ్యాక్టరీస్ శాఖలోని ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పరిహారం హామీలు అమలు అయ్యేనా,,,??:

సిగాచి ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, ఈ ఎస్ ఐ, పి ఎఫ్, ఇన్సూరెన్స్ మొత్తాలను కలిపి కంపెనీలు కేవలం రూ.42 లక్షలు మాత్రమే చెల్లించాయి.సరాక ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.70 లక్షల పరిహారం ఇస్తామని చెప్పినప్పటికీ, గాయపడిన, శాశ్వత వికలాంగులుగా మారిన కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. వైద్య ఖర్చులు భరించలేక, ఉపాధి లేక బాధిత కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి:

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పరిశ్రమల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే మూసివేత ఉత్తర్వులు ఇవ్వాలి ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని, విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడిన కార్మికులకు పూర్తి వైద్య ఖర్చులతో పాటు జీవితాంతం పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి. ఫ్యాక్టరీస్ శాఖ అధికారులు ప్రతి ఏటా అన్ని పరిశ్రమల్లో ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌లు, మేజర్ యాక్సిడెంట్ హజార్డ్స్ (ఎం ఏ హెచ్) నిబంధనల అమలుపై సమగ్ర తనిఖీలు చేపట్టాలి.

ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమా?:

పరిశ్రమల యాజమాన్యం యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం, తీవ్ర నిర్లక్ష్యం, లోపాల కారణంగానే తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి అని కార్మికులు వాపోతున్నారు బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు, పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికుల భద్రతకు శాశ్వత పరిష్కారం చూపెట్టి కార్మికుల భద్రతను పరిశ్రమల యాజమాన్యాలు చేపట్టాలని ఈ సందర్భంగా పాలవ్వరు కార్మికులు వాపోయారు

దేవరుప్పులలో ఉద్రిక్తత.. బీజేపీ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట!.

- దేవాదుల జలాలతో రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ ఆందోళన
- సూర్యాపేట-జనగామ ప్రధాన రహదారిపై రాస్తారోకో
- భారీగా నిలిచిన వాహనాలు
- సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీసులకు స్వల్ప గాయాలు
- దేవాదుల నీటి కోసం బీజేపీ రాస్తారోకో.

ప్రజా వాయిస్ | దేవరుప్పుల /అక్టోబర్ 24 జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

దేవాదుల నీటి కోసం బీజేపీ రాస్తారోకో

.దేవాదుల ప్రాజెక్టు ద్వారా పాలకుర్తి నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనం యత్నం.. పోలీసులతో వాగ్వాదం.

ఆందోళనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పోలీసుల నుంచి దిష్టిబొమ్మను లాక్కొని బీజేపీ కార్యకర్తలు నిప్పంటించినట్లు సమాచారం.

మంటలు ఎగసిపడి పోలీసులకు స్వల్ప గాయాలు

.డీజిల్‌తో తడిపిన దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో కొందరు పోలీసుల చేతులకు మంటలు అంటుకొని స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. ఘటనతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.

పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో దేవరుప్పుల మండల కేంద్రంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సున్నం చెరువు వద్ద అక్రమ నీటి దందాకు హైడ్రా చెక్

- ఇళ్లలోనే బోర్లు
- భూగర్భ పైపులతో నీటి తరలింపు
- 15 బోర్లు తొలగింపు
- కొనసాగుతున్న తనిఖీలు

ప్రజావాయిస్//హైదరాబాద్: సున్నం చెరువు పరిసరాల్లో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్న వ్యవహారంపై హైడ్రా కొరడా ఝులిపించింది.శనివారం చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఇళ్లలో,బెడ్‌రూమ్‌లు, వంటగదులు,నీటి సంపుల వద్ద ఏర్పాటు చేసిన బోర్లను గుర్తించి చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం వరకు 15 బోర్లను తొలగించడంతో పాటు,నీటిని తరలించేందుకు భూగర్భంలో ఏర్పాటు చేసిన పైపులను సైతం తొలగించింది.సీఎంసీ, రెవెన్యూ,జలమండలి అధికారుల సమన్వయంతో ఉదయం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ ఆపరేషన్ సాయంత్రం వరకు కొనసాగింది.భారీ ట్యాంకర్లలో నీటిని తరలించి,చిన్న ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్న తీరును అధికారులు పరిశీలించారు.మరిన్ని అక్రమ బోర్లు ఉన్నాయా అనే కోణంలో తనిఖీలు కొనసాగించాలని హైడ్రా నిర్ణయించింది.

చెరువు నీరు పెరిగినా.. భూగర్భ జలాలపై ఒత్తిడి

సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో గతంలోనూ అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు చేపట్టింది.చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించిన తర్వాత నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి మెరుగుపడిందని అధికారులు పేర్కొన్నారు. అయితే పరిసర ప్రాంతాల్లో భారీగా బోర్లు వేసి నీటిని తోడుతున్నారంటూ ఫిర్యాదులు రావడంతో తాజాగా చర్యలు చేపట్టారు.గతంలో 60 అడుగుల లోతులోనే నీరు లభించేదని,ప్రస్తుతం వందల అడుగులు తవ్వినా నీరు పడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ బోర్లు ఎండిపోవడంతో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని,మరోవైపు కొందరు నీటిని ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారని ఆరోపించారు.

నీటి నాణ్యతపై గతంలోనే హెచ్చరికలు

గతంలో సున్నం చెరువు పరిసర బోర్ల నీటిని పరీక్షించగా కాడ్మియం, సీసం,నికెల్ వంటి హానికర లోహాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైందని హైడ్రా తెలిపింది.ఈ నేపథ్యంలో ఆ నీటిని వినియోగించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి.నీటి కొరత మరింత తీవ్రమయ్యేలోపే అక్రమ నీటి వ్యాపారంపై చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

- మ్యాన్ హోల్స్ తొలగించి మమ అనిపించారా.?
- బుద్వేల్ గ్రీన్ సిటీ వెంచర్ పై పూర్తిస్థాయి చర్యలెక్కడ?
- భవన నిర్మాణ అనుమతులపై గోప్యత ఎందుకు.?
- వివరణ అడిగితే మొహం చాటేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలంటున్న స్థానిక నివాసులు

ప్రజావాయిస్// రాజేంద్రనగర్: సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రీన్ సిటీలో వెలసిన ఇల్లీగల్ వెంచర్ వ్యవహారంపై ప్రజావాయిస్ పత్రికలో ప్రచురితం అయిన కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించినా,చర్యలు మాత్రం నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. వెంచర్‌లోని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ తొలగించి చేతులు దులుపుకున్నారా.? అసలు సమస్యను పక్కనపెట్టి పైపై చర్యలతో సరిపెట్టడం వెనుక ఆంతర్యమేమిటన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లేఅవుట్ అనుమతులపై స్పష్టత ఇవ్వాలి.నిబంధనల ఉల్లంఘనలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.కానీ మ్యాన్‌హోల్స్ తొలగింపుతోనే బాధ్యత ముగిసిపోతుందా.? వెంచర్‌కు సంబంధించిన అనుమతులు,నిర్మాణాలు, ప్లాట్ల విక్రయాలపై పూర్తిస్థాయి విచారణ ఎప్పుడు చేపడతారని స్థానికుల్లో సందిగ్ధత నెలకొంది.మరోవైపు,అక్కడ మూడు భవన నిర్మాణాలకు కోర్టు నుంచి అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.అయితే ఆ అనుమతుల కాపీలు కోరితే స్పష్టమైన పత్రాలు చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఉన్నప్పుడు వాటిని వెల్లడించడంలో అభ్యంతరం ఏమిటి.? ప్రజలకు పారదర్శకంగా వివరించాల్సిన బాధ్యత అధికారులకు లేదా.? అన్న ప్రశ్నలు స్థానికుల్లో తలెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు ప్రయత్నించినా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదన్న విమర్శలున్నాయి.ప్రజలకు సంబంధించిన అంశంపై సమాధానాలు ఇవ్వకుండా మౌనం పాటించడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది.ప్రజావాయిస్ కథనం తర్వాత కదలిక వచ్చింది, కానీ అసలు సమస్యకు పరిష్కారం ఎక్కడ.? మ్యాన్‌హోల్స్ తొలగింపుతో సరిపెట్టకుండా, అనుమతులపై స్పష్టత ఇవ్వడంతోపాటు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజల పెట్టుబడులకు సంబంధించిన ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజావాయిస్ ప్రశ్న ఒక్కటే..నామమాత్రపు చర్యలతో సరిపెడతారా.? లేక నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటారా.? సమాధానం చెప్పాల్సింది సంబంధిత అధికారులే..!

గజ్వేల్లో రైతుల పట్ల అధికారుల తీరు మారదా?

- రైతుపై ఎస్సై చేయి చేసుకున్నారనే ఆరోపణలు
- కనుబొమ్మ వద్ద గాయమై రక్తస్రావం
- ఘటనపై విచారణ చేపట్టిన ఏసీపీ నర్సింలు
- తహసీల్దార్ ఘటన మరువక ముందే మరో ఘటన
- తప్పు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారుల వ్యవహారశైలి మరోసారి చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన రైతు భీమరి రవిపై ఎస్సై మల్లారెడ్డి చేయి చేసుకున్నారనే ఆరోపణలు కలకలం రేపాయి. ఈ ఘటనలో రవి కనుబొమ్మ ప్రాంతంలో గాయమై రక్తస్రావం జరిగిందని ఆయన బంధువులు ఆరోపించారు. రైతు భీమరి రవికి వ్యవసాయ పొలంలోని బోరు మోటారు నీటి విషయంలో పొరుగువారితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో జరిగిన దాడిలో రవికి గాయాలయ్యాయని, స్థానికులు అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిసింది. అనంతరం పొరుగువారిపై ఫిర్యాదు చేసేందుకు రవి గజ్వేల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్సై మల్లారెడ్డి తన చెంపపై కొట్టడంతో కనుబొమ్మ వద్ద గాయమై రక్తస్రావమైందని రవి బంధువులు ఆరోపించారు.

రైతు, ఎస్సై మధ్య వాగ్వాదం.. విచారణ చేపట్టిన ఏసీపీ

ఘటనపై సమాచారం అందుకున్న గజ్వేల్ ఏసీపీ నర్సింలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. రైతు రవికి, ఎస్సై మల్లారెడ్డికి మధ్య వాగ్వాదం జరిగిందని, ఈ క్రమంలో ఎస్సై కొట్టడంతో రైతుకు గాయమైందని ఏసీపీ వెల్లడించారు. గాయపడిన రవికి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

గతంలో రైతుతో అవహేళనగా మాట్లాడి సస్పెండైన తహసీల్దార్

గతంలో గజ్వేల్ తహసీల్దార్ స్వామి ఓ రైతుతో మాట్లాడిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. నువ్వు పురుగుల మందు తాగి సావలేదా? బతికే ఉన్నవా? అంటూ రైతును ఉద్దేశించి స్వామి నవ్వుతూ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తన పరిస్థితిని చూసి నవ్వుతారా? అని రైతు ప్రశ్నించగా, అవును వస్తది.. బరాబర్ నవ్వు వస్తది అంటూ తహసీల్దార్ వెటకారంగా మాట్లాడారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తహసీల్దార్ స్వామిని సస్పెండ్ చేశారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించినప్పుడు వారితో మర్యాదగా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గతంలో తహసీల్దార్ వ్యాఖ్యల వివాదం, తాజాగా ఎస్సైపై వచ్చిన ఆరోపణలు అధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. తాజా ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దశాబ్దకాల మంచినీటి సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

- 41వ డివిజన్‌లో నూతన పైపులైన్ పనులు ప్రారంభం
- ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం
- సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

ప్రజా వాయిస్ గోదావరిఖని

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న మంచినీటి సమస్య పరిష్కారం దిశగా నూతన పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శిశు మందిర్ మెయిన్‌లైన్ నుంచి వెనక లైన్‌కు ఇంటర్‌లింక్ ద్వారా కొత్త మున్సిపల్ పైపులైన్ ఏర్పాటు చేసేందుకు శనివారం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా బస్తీ పెద్దలు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ.. 41వ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

చేస్తున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న మహిళలు, బస్తీ పెద్దలు తన దృష్టికి సమస్యను తీసుకురావడంతో మున్సిపల్ అధికారులతో మాట్లాడి నూతన పైపులైన్ పనులు ప్రారంభించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడమే కాకుండా, ఎన్నికల అనంతరం కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మార్కపురి సూర్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు కొండపర్తి సంజీవ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, పల్లె ఐలయ్య, ఆనందం, పరశురాములు, వెంకన్న, కొమురయ్య, వంశీతో పాటు మున్సిపల్ లైన్‌మన్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు

చిన్నమెట్టుపల్లిలో 'సాగు సంరక్షణ' కార్యక్రమం

'ఎల్ నినో' ప్రభావంతో తగ్గిన నీటి లభ్యత

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

సబ్సిడీపై విత్తనాలు, బిందు-తెలికపాటి సేద్య పరికరాలు

ప్రజా వాయిస్, కోరుట్ల

కోరుట్ల మండలం చిన్నమెట్టుపల్లి గ్రామ పంచాయతీ ప్రాంగణంలో శనివారం 'సాగు సంరక్షణ' (ఖేతీ బచావో అభియాన్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ.. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీలు పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా 'ఎల్ నినో' వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. దీనివల్ల నీటి లభ్యత తగ్గుతుందని, రైతులు యాసంగిలో వరి సాగు చేసి నష్టపోవద్దని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ పెసర, మినుము వంటి ఆరుతడి పంటలను సాగు చేసి లాభాలు పొందాలని కోరారు. సబ్సిడీపై అందుబాటులో ఉన్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యానవన అధికారి అన్వేష్ మాట్లాడుతూ సబ్సిడీపై అందజేస్తున్న బిందు, తుంపర సేద్య (డ్రిప్, స్ప్రింక్లర్) పరికరాల వివరాలతో పాటు ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అబ్దుల్ రహీం, సహాయ వ్యవసాయ అధికారి ఫమీనా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పంట రుణాలు, గ్రామీణ రుణాలు తక్షణమే మాఫీ చేయాలి

బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్

ప్రజా వాయిస్ హుస్నాబాద్

?రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటున్నాయని, ఇటువంటి విపత్కర సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కరెంటు, నీటిని పొదుపుగా వాడాలని చెబుతోందే తప్ప, రైతులకు కావాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలను చూపించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కోరుతున్నట్లు రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేద్దామంటే రాష్ట్రంలో కోతుల తీవ్రత వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందని, పంటలను కాపాడుకోవడం రైతులకు గగనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

?రాష్ట్ర ప్రభుత్వానికి కోతుల నివారణపై ఎలాంటి సమగ్ర ప్రణాళిక లేకపోవడం వల్లే రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపలేక, కేవలం వరి పంటపైనే ఆధారపడాల్సి వస్తోందని రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. గతంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో కోతులను పట్టడానికి పది కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని బిఎస్పి తరపున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కానీ మూడు సంవత్సరాలు గడిచినా మూడు కోతులను కూడా పట్టిన దాఖలాలు లేవని, క్షేత్రస్థాయిలో పరిస్థితి యథాతథంగానే ఉందని ఎద్దేవా చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతింటున్నారని, కాబట్టి రైతులకు చెందిన

పంట రుణాలు, గృహ రుణాలు, వారి పిల్లల చదువుల కోసం తీసుకున్న విద్యా రుణాలు సహా అన్ని రకాల రుణాలను ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని బిఎస్పి తరఫున డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించాలని యోచిస్తున్న తరుణంలో, సాగుకు దూరంగా ఉండే ప్రతి రైతు కుటుంబానికి నెలకు 25 వేల రూపాయల చొప్పున జీవన భృతి అందించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్

నూతన క్రిమినల్ చట్టాలపై సాయుధ దళాల సిబ్బందికి శిక్షణ

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ సూచన మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని సాయుధ బలగాల సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాల పట్ల అవగాహన కల్పించుటకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత . కార్యాచరణ చేపట్టారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సాయుధ బలగాల విభాగంలో కానిస్టేబుల్ నుండి కమాండెంట్ వరకు గల మొత్తం 971 సిబ్బందిని 20 బ్యాచ్ లు గా విభజించి, రోజుకు ఒక బ్యాచ్ చొప్పున మడికొండ లోని కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రం లో శిక్షణ ఇచ్చుటకు కు ప్రణాళికా రూపొందించారు. అందులో భాగంగా శనివారం మొదటి బ్యాచ్ కి పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్, ఎసిపి రమణబాబు పర్యవేక్షణలో శిక్షణనిచ్చారు.ఈ సందర్భంగా సిబ్బందికి నూతన చట్టాల పైన అవగాహన, ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నేర స్థలంలో సాక్షాదారాల సేకరణ, ధర్నాల నిర్వహణ, ముందస్తు అరెస్టులు, నేరాల విభజన, మహిళలపై జరిగే నేరాలు, టెర్రరిస్టు చట్టాలు, సైబర్ నేరాలు, నేర విచారణలో పోలీసులకు ఉన్న అధికారాలు మొదలగు అంశాల పట్ల శిక్షణనిచ్చారు.ఈ కార్యక్రమంలో చీఫ్ లా శిక్షకులు ఇన్స్పెక్టర్ సూర్యప్రకాశ్, సహాయక లా శిక్షకులు సబ్-ఇన్స్పెక్టర్ లు విజయ్, దేవేందర్, ఆర్ఐ ఉదయబాస్కర్, ఆర్ ఎస్సై రమేష్ మరియు శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ప్రజావాయిస్/వికారాబాద్:

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో వివిధ

బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఏళ్ళ ుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి సేవలను గుర్తించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వాటిని వీలైనంత త్వరగా అమలు చేయాలని కోరారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా వారికి ఉద్యోగ భద్రతతో పాటు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు.ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించకూడదని పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులతో చర్చలు జరిపి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు వారి డిమాండ్లపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ రెడ్డి,యువ నాయకుడు రాజేందర్ గౌడ్,దశరథ్ గౌడ్,చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్,ఇతర సామాగ్రి పంపిణీ చేసిన -కౌన్సిలర్ అనంత అలివేలమ్మ గోపాల్ రెడ్డి

నాగర్ కర్నూల్ ప్రజా వాయిస్ (అక్టోబర్ 24)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు సరికొత్త కార్పొరేట్ లుక్ తో కూడిన స్కూల్ యూనిఫామ్స్, షూస్, సాక్స్ లను బ్రాండెడ్ కిట్లను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడులను ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుండి ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ ప్రాథమికోన్నత పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫామ్స్, షూస్,సాక్స్ లను విద్యార్థులకు అందజేసేందుకు ముఖ్య అతిథిగా 7వ వార్డు కౌన్సిలర్ అనంత అలివేలమ్మ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్, ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అలివేలమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని ఆమె తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు గా దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత వారినే ఉందని గుర్తు చేశారు. నేటితరం విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ సమాజ సేవ, వ్యాపార రంగాల్లో, ఎదగాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తక జ్ఞానమే కాకుండా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి, వారి ఉజ్వల భవిష్యత్తు కు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ బాబు, ఉపాధ్యాయులు, ఏ ఏపీసీ చైర్ పర్సన్ యాదమ్మ, పెద్దలు, చంద్రయ్య, బాలస్వామి, రవీందర్ రెడ్డి, రామకృష్ణ, బాలమశి, హుస్సేన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గట్టేపల్లి హనుమాన్ ఆలయానికి బోర్‌వెల్ సౌకర్యం

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిధుల నుంచి రూ.2 లక్షల మంజూరు
- నీటి వసతి అందుబాటులోకి రావడంతో భక్తులకు ఊరట

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎంపీ నిధుల నుంచి మంజూరైన రూ.2 లక్షలతో సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హనుమాన్ దేవాలయానికి బోర్‌వెల్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మోటార్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో దేవాలయ అవసరాలకు, ఆలయానికి వచ్చే భక్తులకు నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.దేవాలయానికి నీటి వసతి కల్పించేందుకు నిధులు మంజూరు చేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు సహకరించిన వారందరినీ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్, గట్టేపల్లి సర్పంచ్ గుండేటి దేవేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మూల సత్యం, మత్స్య పారిశ్రామిక సంఘం గ్రామ అధ్యక్షుడు ఐలవేణి వీరస్వామి, ఈర్ల రమేష్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు శేరుపల్లి విద్యార్థులు

పలుస శంకర్ గౌడ్ ప్రశంసలు

శ్రీరంగాపూర్ అక్టోబర్ 25 ప్రజా వాయిస్

మండల పరిధిలోని శేరుపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలో చదువుకున్న విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ప్రశంసించారు. శనివారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన 5 గురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పల్లెటూళ్ళలో పుట్టి క్రమశిక్షణతో చదువుకొని గొప్పగా ఎదిగినవారు ఎంతోమంది ఉన్నారని అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుండే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకొని అందులో చక్కగా రాణించాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫెన్సింగ్ (కత్తి యుద్ధ)పోటీలో ద్వితీయ స్థానం సాధించిన సురేఖ,భువనేశ్వర్ లలోని సైనిక్ స్కూల్ లో సీటు సాధించిన భార్గవ్, రూపా సీఈఓ కాలేజీలో సీటు సాధించిన రూప, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఫైనల్ లో బెస్ట్ మార్కులు సాధించిన వర్ష లను కళావేదిక పక్షాన శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం ఉందని కొనియాడుతూ ఉపాధ్యాయులు నరసింహ,రమేష్,ఈశ్వర్ రెడ్డి,ప్రసన్న లను కూడా సన్మానించారు.ఈనాటి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల వెంకటయ్య,ఉప సర్పంచ్ బిచ్చన్న,ఎం.ఈ.ఓ హనుమంతు,కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్ర శేఖర్, రంగస్థల కళాకారుల జిల్లా అధ్యక్షుడు ఎల్.ఉమా మహేశ్వర్,మొయినుద్దీన్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్త సమ్మెకు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల పిలుపు

సమస్యల పరిష్కారం కోసం డీఎంఈ, టీవీ కమిషనర్ కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేత

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చిన్నబోస్క నరేష్.

ప్రజా వాయిస్, హైదరాబాద్.
శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్వైజర్లు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రోజున డీఎంఈ, టీవీ కమిషనర్ కార్యాలయాల్లో రాష్ట్రవ్యాప్త సమ్మె నోటీసులు అందజేశారు. గతంలో హైదరాబాద్ సమీపంలో ధర్నా నిర్వహించినప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. టెండర్ కాలపరిమితి ముగిసి దాదాపు ఏడాది కావస్తున్నా తమ సమస్యలు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 7, 2026న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ యూనియన్లకు అతీతంగా


SPS M&H W ASSOCIATION
State President Kurri Saidaiah
State General Secretary Chinaboska Naresh
State Joint Secretary Ubbani Ramana
State Treasurer Srinivas Pathipati
State Vice President Vainala Ravi
M. Venkanna Kumar
P. Ramaiah
G. Nagaraju
A. Kiran Kumar
Matte Srinu
Nageshwar Rao
Anjali
Rajendar
Venu
Venkateshwar Rao
T. Santhosh
V. Sravan Kumar
M. Praveen
A. Prasad
M. Nagabhushanam
సమ్మె నోటీసు
Director of Medical Education,

పాల్గొని తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సమయం ఆసన్నమైందని, అందరూ సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చిన్నబోస్క నరేష్, రాష్ట్ర నాయకులు నాగమణి, కిరణ్ కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రవీణ్, ఎస్పీఎస్ సీనియర్ నాయకులు పురం శంకర్, ఎస్.కె. నానివి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ పై సమీక్షా సమావేశం...

పట్టభద్రులు అందరూ ఫోటోకు నమోదు చేసుకోవాలి

నవంబర్ ఆరో తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది

బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్/రాయపర్తి
వరంగల్ జిల్లా రాయపర్తి బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు.వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ పై రాయపర్తి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, నవంబర్ 6 వ తేది వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది కావున పట్టభద్రులు అందరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి అని పిలుపు ఇచ్చిన పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి మారపెల్లి సుధీర్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,పి ఏ సి ఎస్ (గ్రాూజూ) చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి, మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు మండల పార్టీ నాయకులు ఐత రామ్ చందర్, కర్ర రవీందర్ రెడ్డి, బందెల బాలరాజు, ఎలామంచ శ్రీనివాస్ రెడ్డి, గాదె రవీందర్ రెడ్డి, ఆశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, ఐత రవి, బండారి అశోక్,గ్రామ పార్టీ ఇంచార్జి లు వివిధ గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి...

బిజెపి పాపన్నపేట మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి....

ప్రజా వాయిస్, పాపన్నపేట
పాపన్నపేట మండలం పరిధిలోని ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో భక్తులకు భద్రత, మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత బి ఆర్ ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని బిజెపి పాపన్నపేట మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి విమర్శించారు. ఆలయ పరిసరాల్లో కంచే, భద్రత సిబ్బంది ఉచిత వసతి, స్నాన ఘట్టాలు,

త్రాగునీరు, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభించకపోవడంపై అసంపూర్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాజాపా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

మూడు రోజుల నిరీక్షణ ముగిసింది...

రోల్ మామడలో బావిలో శవమై తేలిన మహిళ

బుధవారం పొలానికి వెళ్లిన గేడం కమలాబాయి హఠాత్తుగా అదృశ్యం

చుట్టుపక్కల గ్రామాలు, వాగులు గాలించినా దొరకని ఆచూకీ

శుక్రవారం పొలాల్లోని బావిలో లభ్యమైన మృతదేహం.. కన్నీటిసంద్రంలో కుటుంబం

పోస్టుమార్టానికి తరలింపు.. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్న పోలీసులు

ప్రజా వాయిస్, నెరడిగొండ / బోథ్ నియోజకవర్గం
సంతోషంగా సాగిపోతున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం కమ్ముకుంది. నెరడిగొండ మండలం రోల్ మామడ గ్రామానికి చెందిన గేడం కమలాబాయి (35) గత బుధవారం ఉదయం అలవాటు ప్రకారం పొలం పనుల నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రమైనా ఇంటికి చేరకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకడం ప్రారంభించారు. ?గ్రామస్తుల సాయంతో సోషల్ మీడియా ద్వారా సమాచారం పంచుకుంటూ, పొలాలు,

పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారు. ఎక్కడో ఒకచోట సురక్షితంగా కనిపిస్తుందని ఆశగా ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయం తీరని గుండెకోత మిగిలింది. గ్రామ సమీపంలోని పొలాల్లో ఉన్న ఓ బావిలో ఆమె విగతజీవిగా తేలియాడటం

స్థానికుల కంటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు ఆఫీసులకు స్థలాలు దొరకడం లేదు

ఆసుపత్రికి 22 కోట్లు మంజూరయి రెండేళ్లు

కుంటుపడుతున్న దోమకొండ అభివృద్ధి

ఇప్పటికే 2 విద్యాలయాలు ఇతర గ్రామాలకు

నేతల అసమర్ధత అధికారుల అలసత్వం

గందరగోళంగా 50 పడకల ఆసుపత్రి స్థలం ఎంపిక

బీసీ గురుకులం బీబీపేటకు

కస్తూరిభా విద్యాలయం సీతారాంపల్లికి

కేటాయించిన నిధులు రద్దు ప్రమాదం

ప్రజావాయిస్ దోమకొండ/
ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణముకు 22 కోట్ల రూపాయలు మంజూరై రెండేళ్లు గడుస్తున్నాయి.పాత తాలూకా కేంద్రమైన దోమకొండలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థలమే దొరకడం లేదు.ఇప్పటికే రెండు ప్రధాన విద్యాలయాలు పక్క గ్రామాలకు తరలిపోయి అభివృద్ధి పై విమర్శలు వస్తున్నాయి. బీబీపేటకు బీసీ గురుకుల పాఠశాల, సీతారాంపల్లికి కస్తూరిభా బాలికల విద్యాలయం తరాలిపోయాయి.ప్రభుత్వ విద్యాసంస్థలు, దోమకొండ అభివృద్ధిపై మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రం దోమకొండ అభివృద్ధి విషయంలో వెనుకబడుతోందని ప్రజలు భావిస్తున్నారు ప్రజలకు విద్యార్థులకు విద్యా, వైద్య సదుపాయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వ సంస్థల నిర్మాణానికి అవసరమైన స్థలాల ఎంపికలో జాప్యనికి నాయకుల అసమర్ధత అధికారుల నిర్లక్ష్యము కారణము అవుతున్నాయని అంటున్నారు అభివృద్ధికి దోహదపడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు స్థలాల ఎంపిక లో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విద్యాసంస్థలు అందుబాటులో ఉంటే మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సీతారాంపల్లికి కస్తూరిబా బాలికల విద్యాలయం, బీసీ రెసిడెన్షియల్ విద్యాలయం బీబీపేటకు వెళ్లడానికి కారణం దోమకొండలో స్థలాలు చూపకుపోవడమేనని మండల వాసులు విమర్శిస్తున్నారు.కస్తూర్బా బాలికల పాఠశాల సీతారాంపల్లికి వెళ్లడం వంటి పరిణామాలు మండల కేంద్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటు,

50 పడకల ఆసుపత్రికి ప్రతిపాదించిన దేవుని కుంట స్థలం

అభివృద్ధిపై చర్చకు దారితీస్తున్నాయి. గతంలో అవసరమైన స్థలాలు చూపకపోవడంతో హాస్టళ్లు సైతం పక్క గ్రామాలకు, పక్క మండలాలకు తరలివెళ్లడంతో దోమకొండ మండల ప్రజలకు అందాల్సిన సదుపాయాల విషయంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

50 పడకల ఆసుపత్రికి స్థలం ఎంపికలో జాప్యం
దోమకొండ మండల కేంద్రంలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణంకు 22 కోట్ల రూపాయలు రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. ఆసుపత్రి స్థల నిర్ణయంలో జాప్యం జరుగుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే మండలంలోని అనేక గ్రామాల ప్రజలకు, పరిసర మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అత్యవసర వైద్యం కోసం కామారెడ్డి నిజామాబాద్ హైదరాబాద్ దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. 50 పడకల ఆసుపత్రి నిర్మాణం విషయంలో స్థల ఎంపిక ప్రక్రియ వేగవంతం కావాల్సి ఉండగా, నిర్ణయం కొలిక్కి రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

నాయకుల మధ్య సమన్వయ లోపమే కారణమా?
ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు వంటి ప్రజోపయోగ నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తించడం, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా భూమిని సేకరించడం అధికారుల బాధ్యత. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా కీలకం. నాయకుల మధ్య సమన్వయం కొరవడితే స్థల ఎంపిక, తదుపరి పరిపాలనా ప్రక్రియలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దోమకొండలోనూ ఇదే పరిస్థితి నెలకొందా? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్థల ఎంపికకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నప్పటికీ, ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్లే జాప్యం జరుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. 50 పడకల ఆసుపత్రి స్థల ఎంపిక పై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

అభివృద్ధి కుంటుపడితే నష్టపోయేది ప్రజలే!
ప్రభుత్వ సంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణతో మండల కేంద్రం అభివృద్ధి చెందడమే కాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. కానీ కీలకమైన ప్రాజెక్టుల విషయంలో నిర్ణయాలు ఆలస్యమైతే దాని ప్రభావం మండల ప్రజలపై, మండల అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. యువత ఉపాధి కోసం పట్టణాలు, నగరాల బాట పడుతున్నారని వ్యాపార వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ సంస్థలు, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తే స్థానిక ఆర్థిక, వైద్య అనుబంధ కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని భావిస్తున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి
దోమకొండ మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన 50 పడకల ఆసుపత్రితో పాటు భవిష్యత్తులో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ సంస్థలకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించి, నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ పథకాలు, సంస్థలు కేవలం ప్రతిపాదనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చినప్పుడే ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. దోమకొండ మండల అభివృద్ధికి అవసరమైన స్థలాల గుర్తింపు, ఆసుపత్రి నిర్మాణంపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని జాప్యానికి తెరదించాలని ప్రజలు ఆశిస్తున్నారు.ఇప్పటికైనా నాయకులు, అధికారులు సమన్వయంతో ముందడుగు వేయాలని దోమకొండకు రావాల్సిన అభివృద్ధి పనులకు మోక్షం కరిగించాలని మండల ప్రజలు విద్యార్థులు పేద రోగులు ఆశిస్తున్నారు.

పట్టభద్రుల ఓట్లతో ప్రభుత్వ వైఫల్యాలకు బుద్ధి చెప్పాలి

రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు చురుగ్గా పాల్గొనాలి: బీజేపీ నేతలు

పాఠశాలలో 15 రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరించకపోతే కార్యాచరణ ప్రకటిస్తాం

శ్రీరంగాపూర్, అక్టోబర్ 24 ప్రజా వాయిస్
ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు క్షేత్రస్థాయిలో అమలు మాత్రం కనిపించడం లేదని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. మాటలతో కాలక్షేపం చేయడం మానేసి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి హితవు పలికారు. శనివారం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ఎన్నికల కన్వీనర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటు కేవలం హక్కు మాత్రమే కాదని, పాలకుల పనితీరును ప్రశ్నించే శక్తివంతమైన

ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను అందుబాటులో ఉంచామని, అర్హులైన పట్టభద్రులు వారి వద్దకు వెళ్లి ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎక్కడ? పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. రైతులకు పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. జూరాల నీటి నిర్వహణ, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లింపుల విషయంలోనూ ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశం అనంతరం బీజేపీ నాయకులు శ్రీరంగాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా తాగునీరు, మధ్యాహ్న భోజనం తదితర మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు కనీసం తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొనడం ఆందోళనకరమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. 15 రోజుల్లోగా తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణ ప్రకటించి, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం అధికారుల బాధ్యత అని, ఆ బాధ్యతను విస్మరిస్తే ప్రజల తరఫున నిలదీస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, మండల అధ్యక్షుడు నల్లోత్తుల విష్ణు, శివ, చరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం.. ప్రాణదానానికి ముందుకొచ్చిన యువత..

రక్తదానం మహాదానం.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలి: జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా వాయిస్ / నల్లగొండ క్రైమ్:
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడినవారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, ప్రసవ సమయంలో రక్తస్రావంతో బాధపడే మహిళలకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దేశం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిమ్మదుర్తిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మంజూరు చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రజా వాయిస్ నిర్మల్ జిల్లా ప్రతినిధి
మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం దిమ్మదుర్తి గ్రామంలో కలెక్టర్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పలు ఇళ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న ఏడుపాయల పోలీసులు.....

ప్రజా వాయిస్, పాపన్నపేట
పాపన్నపేట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది శ్రీకాంత్, భూపాల్ తమ నిజాయితీని చాటుకున్నారు. శనివారం ఆలయ గోపురం వద్ద దొరికిన బ్యాగులో ఐఫోన్, రూ. పదివేల నగదు రెండు బంగారు ఉంగరాలను గుర్తించారు. ఆలయ ఈవో సమక్షంలో కూకట్పల్లి కి చెందిన బ్యాగు యజమాని శ్రీకాంత్ కు వాటిని అప్పగించారు. పోలీసుల నిజాయితీ బాధ్యతాయుతమైన విధి నిర్వహణను మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి సీపీఐ(ఎం) బహిరంగ లేఖ..

ప్రజల ఓట్లు కావాలి.. కానీ ప్రజల రోడ్ల సమస్యలు పట్టవా..
రోడ్ల పనులు ప్రారంభించకపోతే ఎమ్మెల్యే పర్యటనలను అడ్డుకుంటాం.
సీపీఐ(ఎం) నేత మట్టిపెల్లి సైదులు

ప్రజా వాయిస్,మోతె.
ప్రజల సమస్యలు పరిష్కరించలేని ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇవ్వాలి? ఇంకెన్నిసార్లు అధికారుల చుట్టూ తిరగాలి? ప్రజల అవసరాలు కనిపించవా? ప్రజల ఇబ్బందులు వినిపించవా? మోతె మండలం రాఘవాపురం నుంచి మునగాల మండలం సీతానగారం, రేపాల గ్రామాలకు లింకు రోడ్డు నిర్మించాలని, అదేవిధంగా మామిల్లగూడెం నుండి నరసింహపురం వరకు, దుబ్బతండ నుంచి నరసింహపురం వరకు రోడ్లు వేయాలని కోరుతున్నా స్పందన లేకపోవడంపై సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల సమయంలో ప్రజలు గుర్తుకొస్తారు.. ఓట్లు కావాల్సినప్పుడు గ్రామాలు గుర్తుకొస్తాయి.. కానీ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన సమయానికి మాత్రం ఎందుకు స్పందించడం లేదు? అని సైదులు ప్రశ్నించారు. రాఘవాపురం నుంచి సీతానగారం, రేపాల, మామిల్లగూడెం నుండి నరసింహపురం వరకు, దుబ్బతండ నుండి నరసింహపురం గ్రామాల వరకు రోడ్ల నిర్మాణం కోసం ప్రస్తుత ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా, వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోందన్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది మోటార్‌సైకిళ్లపై వ్యాపార, వ్యవసాయ ఇతర అవసరాల కోసం ప్రయాణిస్తున్నారని తెలిపారు. గ్రామాల మధ్య రహదారి సౌకర్యం కల్పించాలనే ప్రజల న్యాయమైన డిమాండ్ల ను ఇంతకాలం నిర్లక్ష్యం చేయడానికి కారణమేంటని ప్రశ్నించారు. ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించలేని పాలకులు అభివృద్ధి గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. ఇది ఎవరి వ్యక్తిగత సమస్య కాదు.. వందలాది మంది ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన సమస్య. ఇది ఎవరికో ఒకరికి చేసే ఉపకారం కాదు.. ప్రజలకు కల్పించాల్సిన కనీస మౌలిక సదుపాయం. ప్రజలు పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నా స్పందించకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్యమేనని విమర్శించారు. ఇప్పటికైనా

ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఈ సమస్యపై స్పష్టమైన హామీ ఇవ్వడమే కాకుండా, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల సహనాన్ని పరీక్షించవద్దు!
ఇకపై హామీలతోనో, మాటలతోనో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను సహించేది లేదని సైదులు హెచ్చరించారు. రాఘవాపురం–సీతానగారం--రేపాల రోడ్డు, మామిల్లగూడెం నుండి నర్సింహాపురం వరకు, దుబ్బతండ నుండి నరసింహపురం వరకు రోడ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం. ఎమ్మెల్యే పర్యటనలను అడ్డుకుని ప్రజల నిరసనను తెలియజేస్తాం. రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు పోరాటాన్ని విరమించబోమని ప్రకటించారు. ప్రజల ఓట్లతో పదవులు చేపట్టిన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేస్తే ప్రజాక్షేత్రంలోనే నిలదీస్తామని స్పష్టం చేశారు. తక్షణమే రోడ్లు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మట్టిపెల్లి సైదులు హెచ్చరించారు.

గుర్రంపోడులో తెలంగాణ రైతు సంఘం రణభేరి

జాతీయ మహాసభలకు విస్తృత ప్రచారం
గిట్టుబాటు ధరలు సాగునీరు రైతు హక్కులపై గర్జన
నవంబర్ 15న నల్లగొండలో రైతు మహాగర్జన
36వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం,
నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాలలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. నవంబర్ 15 నుండి 18 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జరగబోయే 36వ అఖిల భారత జాతీయ మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ, నవంబర్ 15న నల్లగొండ ఎన్జీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా

నాయకులు మల్లం మహేష్ మాట్లాడుతూ, వీర తెలంగాణ సాయుధ పోరాట గడ్డ అయిన నల్గొండలో ఈ చారిత్రక మహాసభలు జరగడం గర్వకారణమన్నారు. దేశంలో పంటలకు గిట్టుబాటు ధరల కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని, జిల్లాలో ఎస్.ఎల్.బి.సి సొరంగం పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని, మూసీ ప్రాజెక్టును ఆధునీకరించాలని కోరారు. అలాగే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, రుణమాఫీ, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణను, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ రైతులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దాదాపు 1500 మంది ప్రతినిధులు పాల్గొనే ఈ మహాసభలను జయప్రదం చేయడానికి విరాళాలు ఇచ్చి సహకరించాలని, నవంబర్ 15న నల్లగొండ ఎన్జీ కాలేజీలో జరిగే భారీ బహిరంగ సభలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సర్వయ్య, రైతు సంఘం నాయకులు రాములు, మల్లయ్య, రవి, స్థానిక రైతు సంఘం ప్రతినిధులు మరియు గ్రామీణ రైతులు తదితరులు పాల్గొన్నారు

ప్రజా ప్రభుత్వంలో కరెంటు కోతలు.. రైతన్న అవస్థలు...

- సంక్షోభంలో రైతులు
- స్వరాష్ట్రంలో రైతులకు అసంతృప్తి
-కాంగ్రెస్ పాలనలో రైతుల కంటతడి
- విద్యుత్ కోతలపై ప్రతిపక్షాల స్పందన కరువు

ప్రజా వాయిస్/ అడ్డగూడూరు:
కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో రైతులను నిలువు దోపిడి చేస్తుంది అనడానికి నిదర్శనమే విద్యుత్ కోతలు. విద్యుత్ కోతల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారింది. రైతులు ఆరుగాలం శ్రమించి వరి పంటలు సాగు చేస్తే చివరి దశకు వచ్చేసరికి కరెంటు కోతలు విధించడంతో చేతికంద వచ్చిన పంట కళ్ళ ముందే ఎండిపోతుంది.. రైతు కళ్ళలో నీళ్లు తప్ప మరి ఏమీ లేదు..

విద్యుత్ సరఫరా లో విఫలం
వ్యవసాయ రంగానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అంటున్నారు రైతులు. రాష్ట్రంలో గత పదేళ్లు రైతులకు సాగుకు సరిపడా కరెంటు ఇస్తే నేడు ప్రజా పాలనలో మాత్రం 10 గంటల కరెంటు కూడా కరువైపోయింది. వ్యవసాయం చేసే రైతుకు నిరాశలు తప్ప మరేమీ లేదు. విద్యుత్ తో పాటు రైతులకు ఎరువుల విషయంలో విత్తనాల విషయంలో కూడా ఇబ్బందులు తప్పడం లేదు. రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో లేక

అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

హామీలు ఇచ్చారు... అమలు చేయడం మరిచాడు
ఎన్నికల హామీల లో మాత్రం రైతులకు కావలసిన సాగునీరు ఎరువులు విత్తనాలు నిరంతరం అందుబాటులో ఉంటాయని చెప్పడం తప్ప అవి హామీలుగానే మిగిలిపోతున్నాయి తప్ప అమలు కావడం లేదు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పట్టించుకునే ప్రభుత్వాలు కరువైపోయాయి. ప్రభుత్వాలు మారుతున్న నాయకుల మారుతున్న రైతుల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈ సారి పంట సాగు తగ్గిన కొంతమేరకు మాత్రమే రైతులు పంటలను సాగు చేశారు కనీసం ఆ పంటలకు కూడా సాగు నీరు విషయంలో విఫలమైనప్పటికీ విద్యుత్ విషయంలో కూడా ప్రజా ప్రభుత్వం పూర్తిగా విఫలమై రైతులకు మరోసారి తలనొప్పిగా మారింది. కళ్ళముందే రైతుల పంటలు ఎండిపోతున్న చేసేదేమి లేక పశువుల మేతకు వదిలేశారు.

ప్రతిపక్షాల స్పందన కరువు
రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలుగా చలామణి అవుతున్న బీఆర్ఎస్, బీజేపీ, ఎర్రజెండా పార్టీలు రైతుల గోడును పట్టించుకోవడం లేదు. విద్యుత్ కోతలతో సతమతమవుతున్న రైతులకు వెన్నుదండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు మూగబోయాయి. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రోడ్డు ఎక్కాల్సిన పార్టీలు కనబడడం లేదు. దేశానికి అన్నం పెట్టే రైతు పరిస్థితి నేడు అగమ్య గోచరమైపోయింది.

కరెంటు కోత కాదు ఇది రైతుల కడుపు కోత
కరెంటు కోతలతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కడుపుకోత విధిస్తుంది. రైతులకు ప్రధాన జీవనాధారమైన వరి పంటకు సరిపడా కరెంటు అందక పంటలు ఎండిపోతున్నాయి. చేసేదేమీ లేక రైతులు నీళ్ల ట్యాంకర్లతో తమ పొలాలకు నీళ్లు అందిస్తున్నారు. దీంతో రైతుకు పెట్టుబడి ఖర్చు గతంతో పోలిస్తే మరింత పెరుగుతుంది. దిగుబడి మాత్రం తగ్గుతుంది.

బైరెడ్డి మనోహర్ రెడ్డి
(జర్నలిస్ట్-యాదాద్రి భువనగిరి జిల్లా)

నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను వెంటనే పునరుద్ధరించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ డిమాండ్
రూ.21 లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగం
అద్దె భవనంలో హాస్టల్ నిర్వహణపై ఆందోళన
అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరపాలి
కలెక్టర్, సంక్షేమ శాఖ అధికారులు స్పందించాలి

ప్రజా వాయిస్ /పాలకుర్తి /అక్టోబర్ 24
జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని వెంటనే పునరుద్ధరించి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు చిక్కుడు అశోక్, మొగిలి వంశి ఆధ్వర్యంలో ఆయన హాస్టల్ భవనాన్ని సందర్శించి, పరిస్థితిని పరిశీలించారు.

రూ.21 లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగం.
ఈ సందర్భంగా మారం రవికుమార్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు వసతి కల్పించాలనే ఉద్దేశంతో దాతలు ఉచితంగా అందించిన ఎకరం భూమిలో ప్రభుత్వ నిధులు రూ.21 లక్షలతో ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని నిర్మించారని తెలిపారు. అయితే, ఇంతటి ప్రజాధనంతో నిర్మించిన భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను సద్వినియోగం చేయాల్సిన అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు.

అద్దె భవనంలో హాస్టల్ నిర్వహణపై ఆందోళన
ప్రస్తుతం ఎస్సీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతుండగా, గూడూరులో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం వినియోగంలో లేకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భవనం నిరుపయోగంగా మారడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భవన స్థితిగతులను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు ఉపయోగపడేలా వెంటనే పునరుద్ధరించాలని సూచించారు.
కలెక్టర్, సంక్షేమ శాఖ అధికారులు స్పందించాలి.
జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు

తక్షణమే స్పందించి హాస్టల్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. పేద విద్యార్థుల వసతి సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు వృథాగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు దొంగరి మహేందర్, కడుదుల నిరంజన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్, సీనియర్ నాయకులు కాసోజు సమ్మయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

నీటి లభ్యతను బట్టే పంటల సాగు చేసుకోవాలి!

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితి
యాసంగి లో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి.
రైతులలో చైతన్యం నింపే అందుకే ఉద్దేశించిన ఖేత్ బచావో అభియాన్'లో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు

ప్రజా వాయిస్ /లింగాల ఘనపురం,
జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలోని చీటూరు గ్రామంలో రైతుల్లో చైతన్యం నింపేందుకు ఉద్దేశించిన 'ఖేత్ బచావో అభియాన్' రైతు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్ నినో ప్రభావాల నేపథ్యంలో వర్షపాతంలో తీవ్ర అనిశ్చితి నెలకొనే ప్రమాదం ఉందని, అలాగే రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు, బెట్ట పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, రైతులు తమ ప్రాంతంలోని నీటి లభ్యతను బట్టి మాత్రమే పంటల సాగుపై సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి:
నీటి వనరులు పరిమితంగా ఉన్న రైతులు యాసంగి సీజన్‌లో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్న పంటల జోలికి వెళ్లవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. వాటికి బదులుగా నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలైన పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలు, కూరగాయలు మరియు ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులకు హితవు పలికారు.

సదస్సులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు:
ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (ఇంచార్జి) అంబికా సోని, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి డి హెచ్ ఎస్ ఓ నర్సయ్య, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక

అధికారి డి.వి.హెచ్.ఓ (ఇంచార్జి) మురళి, అధికారులైన ఎంపీడీవో శివ శంకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నజీరుద్దీన్, మండల స్థాయి అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ)లు బి. స్పందన, జి. వినయ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే చీటూరు గ్రామ సర్పంచ్ బర్ల గణేష్, వార్డు సభ్యులు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేశారు.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

కార్మికుల హక్కులు, సామాజిక భద్రత కల్పించాలి
ఛలో హైదరాబాద్ మల్టిపుల్ డేస్ ధర్నా వాల్ పోస్టర్లను విడుదల చేసిన సిఐటియు నాయకులు

ప్రజా వాయిస్.. వనపర్తి
పాన్గల్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26 తేదీలలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మల్టిపుల్ డేస్ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము సిఐటియు నాయకులతో కలిసి ఈ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఉద్యోగులకు పి.ఆర్.సి. అమలు చేయాలని, డి.ఏ. వర్తింపజేయాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే ధర్నాలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అక్టోబర్ 25న పాల్గొనే కార్మికులు, ఉద్యోగులు:
పారిశ్రామిక రంగ కార్మికులు, సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పాల్గొననున్నారు.

అక్టోబర్ 26న పాల్గొనే కార్మికులు, ఉద్యోగులు:
స్కీమ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్థానిక సంస్థల ఉద్యోగులు, యూనివర్సిటీలు, వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగులు, పెన్షనర్లు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ కార్మికులతో పాటు వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పాల్గొననున్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, కనీస వేతనాల సాధనకు, ఉద్యోగ భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ ధర్నాలో వనపర్తి జిల్లా నుంచి కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సంఘాల నాయకులు చందు, మహేశ్వరి, లక్ష్మి, అరుణ, రేణుక, సరస్వతి, లక్ష్మి, లలిత, సావిత్రి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి
జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సుచరిత

ప్రజా వాయిస్ టేక్మాల్ :
టేక్మాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లాదుర్గం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సుచరిత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చట్టాలను తెలుసుకోవడం ద్వారా తమ హక్కులను కాపాడుకోవడంతో పాటు, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ, చట్టాలను గౌరవించాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఇతరుల హక్కులను గౌరవించాలని, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. సమాజంలో జరిగే నేరాలు, వాటి వల్ల కలిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని, చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు తగిన సహాయం పొందాలని సూచించారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా విద్యార్థుల్లో చట్టాల పట్ల అవగాహన పెంపొందించి, నేరరహిత సమాజ నిర్మాణానికి పునాదులు వేయవచ్చని తెలిపారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకొని, సమాజంలో మంచి మార్పు తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేజిస్ట్రేట్ సుచరిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరవింద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ తులసిరామ్, గ్రామ సర్పంచ్ సుధాకర్, రిటైర్డ్ ఎస్ఐ సత్యనారాయణ, నాయకులు వీరప్ప మరియు వివిధ పార్టీల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

NHM ఉద్యోగుల ధర్నాకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి
టీడీపీ నాయకులు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన చీఎవీ ఉద్యోగులకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మొక్కిరాల జనార్ధన్‌రావు, పరకాల నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మొక్కిరాల జనార్ధన్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న చీఎవీ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని. రాష్ట్రవ్యాప్తంగా 78 క్యాడర్లలో పనిచేస్తున్న 17,000 మందికి పైగా ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చీఎవీ JAC ప్రతినిధులతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కందుకూరి నరేష్ మాట్లాడుతూ, చీఎవీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు తమ హక్కుల కోసం నిరాహార దీక్ష చేపట్టాల్సిన పరిస్థితి రావడం పట్ల ప్రభుత్వం వారి సమస్యలను తీవ్రంగా పరిగణించాలని కోరారు. 78 క్యాడర్లలో పనిచేస్తున్న 17,000 మందికి పైగా ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు, బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని నరేష్ కోరారు. వార్షిక ఇంక్రిమెంట్లు, లాయల్టీ బోనస్, బదిలీ సౌకర్యాలు, ప్రసూతి సెలవులు, పదవీ విరమణ ప్రయోజనాలు తదితర అంశాల్లో ఉద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. చీఎవీ ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను

నిర్లక్ష్యం చేయకుండా, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరపాక ప్రభాకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హనుమకొండ సాంబయ్య, పార్లమెంటు ఉపాధ్యక్షులు బర్ల యాకూబ్, వాణిజ్య విభాగం నాయకులు ఎలగందుల రవీందర్ గుప్తా, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకులు, పిట్టల శ్రీనివాస్, ఆత్మకూరు మండల అధ్యక్షులు మరిగిద్దె రాజేశ్వర్‌రావు, దామెర మండల అధ్యక్షులు నల్లా రవి తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని చీఎవీ ఉద్యోగుల నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. చీఎవీ ఉద్యోగులకు న్యాయం చేయాలి షరతులు లేని క్రమబద్ధీకరణ చేపట్టాలి – ఉద్యోగ భద్రత కల్పించాలి అని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

దుర్గామాత ఉత్సవాలకు రూ.10 వేల విరాళం

తిర్మలాయపల్లిలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు
ఉత్సవ కమిటీకి ఆర్థిక సాయం అందించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్ / రాయపర్తి:
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామంలో స్థానిక యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున ఉత్సవాల నిర్వహణకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల బీఆర్ఎస్ నాయకులు, స్థానిక పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం.
కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా
ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్ / రాయపర్తి:
రాయపర్తి మండలం ఊకల్ గ్రామానికి చెందిన నర్ర దేవేందర్ విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున రూ.3 వేల ఆర్థిక సాయం అందజేసి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

షేర్‌పల్లి, కంబాలాపూర్ గ్రామాల్లో నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సులు

శ్రీరంగాపూర్ అక్టోబర్ 24 ప్రజా వాయిస్
మండలంలోని షేర్‌పల్లి, కంబాలాపూర్ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించి, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులను వాడాలని సూచించారు. జీవ ఎరువులు, సేంద్రియ ఎరువుల వినియోగం, పంటల మార్పిడి మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకుని, సాయిల్ హెల్త్ కార్డ్ సూచనల ప్రకారం వ్యవసాయం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో గ్రామ సర్పంచ్‌లు, వ్యవసాయ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ బతుకమ్మ సంబరాలు: పాల్గొన్న ఎస్ఐ పురుషోత్తం

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా సాగిన అంబేద్కర్ బతుకమ్మ వేడుకలు

ప్రజలతో మమేకమై వేడుకల్లో పాల్గొన్న బోథ్ ఎస్ఐ పురుషోత్తం

సామాజిక ఐక్యత, సోదరభావానికి వేదికగా నిలిచిన కార్యక్రమం

ప్రజా వాయిస్, బోథ్ /బోథ్ నియోజకవర్గం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బోథ్‌లో అంబేద్కర్ బతుకమ్మ సంబరాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు బోథ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో హోరెత్తించడంతో ప్రాంగణమంతా పండుగ శోభ సంతరించుకుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావాలను చాటిచెప్పేలా ఈ సాంస్కృతిక వేడుకలు సాగాయి. పోలీసు అధికారులు ప్రజలతో మమేకమై ఇలాంటి పండుగల్లో భాగస్వాములు కావడం సామాజిక సామరస్యానికి, పరస్పర అవగాహనకు ఎంతగానో దోహదపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందిస్తూ, కులమతాలకు అతీతంగా ఐక్యతను చాటాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

ఖాకీ వెనుక మానవత్వం..

16వ సారి రక్తదానం చేసిన మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్..

ప్రజా వాయిస్, మిర్యాలగూడ:

ఖాకీ అంటే కేవలం భయం కాదు.. కఠినంగా వ్యవహరించడమే కాదు, ప్రజలను కాపాడటం కూడా మా బాధ్యత. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటం కూడా మా కర్తవ్యం అనే సందేశంతో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్ 16వ సారి రక్తదానం చేశారు. విధి నిర్వహణలో ప్రజల రక్షణకు కట్టుబడి ఉండటంతో పాటు, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు తన వంతు సహకారం అందించడం అభినందనీయం.
పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం చేసిన ఎస్సై ప్రవీణ్ సేవ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ధాన్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట!

కాళేశ్వరం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లో ప్రత్యేక తనిఖీ కేంద్రం ఏర్పాటు

ప్రజా వాయిస్ కాళేశ్వరం

పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు, స్థానిక రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టినట్లు భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం కాళేశ్వరం అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శనివారం పౌరసరఫరాలు, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా చూడటమే లక్ష్యమన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమంగా రవాణా కాకుండా నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

24 గంటల పాటు నిఘా

కాళేశ్వరం చెక్‌పోస్ట్ వద్ద పోలీస్, పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో 24 గంటల పాటు తనిఖీలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సరిహద్దు దాటి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా, రైతుల ప్రయోజనాలు పరిరక్షించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లొచ్చిన వానరులు.. మహిళకు తీవ్ర గాయాలు

అంగడికి వెళ్ళొస్తుండగా అడ్డుపడ్డ వానర సైన్యం

కూరగాయలు లాక్కునే యత్నంలో భయంతో కిందపడ్డ రాపర్తి భారతమ్మ

తలకు తీవ్ర గాయాలు, స్పృహ కోల్పోయిన వృద్ధురాలు..

కోతుల బెడద నుండి రక్షించాలని గ్రామస్తుల వేడుకోలు..

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కోతుల పంజా విసురుతోంది. అంగడికి వెళ్లి వస్తున్న ఓ మహిళపై వానరులు గుంపుగా ఎగబడి దాడి చేయడంతో ఆమె కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాపర్తి భారతమ్మ సాయంత్రం వేళ అంగడికి వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసుకొని ఇంటికి తిరిగి వస్తోంది. మార్గమధ్యలోని బొడ్రాయి సమీపానికి రాగానే, అక్కడ సంచరిస్తున్న కోతుల గుంపు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకొచ్చింది. చేతిలో ఉన్న కూరగాయలను లాక్కునే క్రమంలో వానరులు చేసిన దాడికి ఆమె తీవ్ర భయాందోళనకు గురై కిందపడిపోయింది. ఈ

ప్రమాదంలో భారతమ్మ తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కిందపడిన వెంటనే ఆమె కాసేపు స్పృహ కోల్పోయింది. ఇది గమనించిన చుట్టుపక్కల స్థానికులు వెంటనే అప్రమత్తమై ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ గతంలో కోతులను పట్టే వారితో వాటిని పట్టించి శ్రీశైలం అటవీ ప్రాంతంలో విడిచి పెట్టడం జరిగింది, మళ్ళీ కొంతకాలంగా కోతుల బెడద రోజురోజుకూ విపరీతంగా పెరగడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నడుచుకుంటూ వెళ్లే పాదచారులను, ఒంటరిగా కనిపించే మహిళలు,

వృద్ధులు, పిల్లలను కోతులు వెంటాడి మరీ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని వాపోయారు. ప్రాణాలు గాల్లో కలిసిపోయేలా ఉన్న ఈ కోతుల బెడదను నివారించేందుకు గ్రామ సర్పంచ్, మరియు అటవీ శాఖ అధికారులు ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దాడులకు పాల్పడుతున్న కోతులను వెంటనే బంధించి అటవీ ప్రాంతాలకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సంగెం సర్పంచ్‌పై కాంగ్రెస్ దౌర్జన్యం

: ప్రజాస్వామ్యానికే మచ్చ అన్న గుర్రపు మచ్చేందర్

అధికార గర్వంతో దాడి చేస్తే సహించేది లేదు: బిఆర్ఎస్ నేత జిఎమ్మార్ తీవ్ర హెచ్చరిక

ప్రజాప్రతినిధులకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి? సిర్గాపూర్ మండల ఘటనపై ఆగ్రహం

సర్పంచ్ కుటుంబంపై దాడిపై సమగ్ర విచారణ జరపాలి: పోలీసులను డిమాండ్ చేసిన బిఆర్ఎస్

బాధిత సర్పంచ్ కుటుంబానికి పరామర్శ: నారాయణఖేడ్ నియోజకవర్గంలో రాజకీయ దుమారం

ప్రజా వాయిస్ నారాయణఖేడ్

నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలంలోని సంగెం గ్రామ బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌పై ఆయన భార్యతో పాటు కుటుంబ సభ్యులపై కాంగ్రెస్

నాయకులు చేసిన దాడి ఘటన తీవ్ర ఆగ్రహం కలిగిస్తోంది. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికే మచ్చగా అభివర్ణించేలా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలల్లో చేస్తున్న దుశ్చర్యలు నేడు ప్రతి చోట చూస్తూనే ఉన్నాం. అధికారంలో ఉన్నామనే అహంకారంతో దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. మునుముందు ఇటువంటి చర్యలు పునరావృతం ఐతే సహించేది లేదని ప్రతిచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పిన బి ఆర్ ఎస్ నాయకులు జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ గుర్రపు మచ్చేందర్ వారితో పాటుగా ప్రజా ప్రతినిధులు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

అక్టోబర్ 26న కొమురం భీమ్ వర్ధంతి : ఘనంగా నిర్వహించాలి.. ఆదివాసీ నాయకుల పిలుపు

బోథ్ ఆదివాసీ భవనంలో రాయిసెంటర్ ఆధ్వర్యంలో కొమురం భీమ్ వర్ధంతి కార్యాచరణపై ప్రత్యేక సమావేశం

అధిక సంఖ్యలో ఆదివాసీలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని న్యాయవాది పంద్రం శంకర్ విజ్ఞప్తి

ప్రజా వాయిస్, బోథ్ /బోథ్ నియోజకవర్గం

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ నాయకులు ప్రాముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. అక్టోబర్ 26వ తేదీన రాయిసెంటర్ ఆధ్వర్యంలో జరుపుకోనున్న గిరిజన విప్లవ వీరుడు కొమురం భీమ్ వర్ధంతి వేడుకల కార్యాచరణ, ఏర్పాట్లపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన

అమరవీరుడి త్యాగాలను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని తీర్మానించారు. ?ఈ సందర్భంగా న్యాయవాది పంద్రం శంకర్ మాట్లాడుతూ.. కొమురం భీమ్ వర్ధంతిని గ్రామీణ ప్రాంతాల నుంచి మండల స్థాయి వరకు ఎంతో వైభవంగా, ఐక్యంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, మహిళా సంఘాల నాయకురాళ్లు, వివిధ గ్రామాల పటేళ్లు, దేవరీలు, మహాజన్లు మరియు యువతీ యువకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సార్మేడి ఆడేం భీంరావ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, మాజీ అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, కరత్వాడ సర్పంచ్ దుర్వ విశ్వేశ్వర్ రావు, పిప్పల్ధారి సర్పంచ్ అనసూయ కిష్టు, కౌటా(కె) సర్పంచ్ కుంరం లక్ష్మణ్, చింతగూడ సర్పంచ్ ఆత్రం కేశవ్, నాగపూర్ సర్పంచ్ మాడవి దేవ్ రావు, చింతగూడ పటేల్ గోడం రమేష్, కనక అమృత్, తొడసం గోపాల్‌తో పాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆదివాసీ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు శేరుపల్లి విద్యార్థులు

పలుస శంకర్ గౌడ్ ప్రశంసలు

శ్రీరంగాపూర్ అక్టోబర్ 25

ప్రజా వాయిస్



మండల పరిధిలోని శేరుపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ప్రశంసించారు. శనివారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన 5 గురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పల్లెటూళ్ళలో పుట్టి క్రమశిక్షణతో చదువుకొని గొప్పగా ఎదిగినవారు ఎంతోమంది ఉన్నారని అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుండే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకొని అందులో చక్కగా రాణించాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫెన్సింగ్ (కత్తి యుద్ధ)పోటీలో ద్వితీయ స్థానం సాధించిన సురేఖ,భువనేశ్వర్ లలోని సైనిక్ స్కూల్ లో సీటు సాధించిన భార్గవ్, రూపా సీఈఓ కాలేజీలో సీటు సాధించిన రూప, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఫైనల్ లో బెస్ట్ మార్కులు సాధించిన వర్ష లను కళావేదిక పక్షాన శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం ఉందని కొనియాడుతూ ఉపాధ్యాయులు నరసింహ,రమేష్,ఈశ్వర్ రెడ్డి,ప్రసన్న లను కూడా సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల వెంకటయ్య,ఉప సర్పంచ్ బిచ్చన్న,ఎం.ఈ.ఓ హనుమంతు,కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్ర శేఖర్, రంగస్థల కళాకారుల జిల్లా అధ్యక్షుడు ఎల్.ఉమా మహేశ్వర్,మొయినుద్దీన్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

థాంగ్-టా పోటీల్లో ఐపీఎస్ విద్యార్థుల పతకాల పంట

- జాతీయ స్థాయి పోటీలకు సనా తబసూమ్, మనోజ్ కార్తి ఎంపిక
- విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటుతూ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి థాంగ్-టా పోటీల్లో పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. విజేతలను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించడంతో పాటు, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రశంసించారు. అండర్-17 బాలుర విభాగంలో మనోజ్ కార్తి (-48 కిలోలు) బంగారు పతకం సాధించగా, సంప్రిత్ (-52 కిలోలు), అద్వైత్ (-56 కిలోలు), సాత్విక్ (-75 కిలోలు) రజత పతకాలు గెలుచుకున్నారు. బాలికల అండర్-17 విభాగంలో కృషిక (-75 కిలోలు) రజతం, శ్రీ వర్షిణి (-48 కిలోలు) కాంస్య పతకాన్ని సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో సనా తబసూమ్ (-41 కిలోలు) బంగారు పతకంతో మెరిసింది. వీరిలో సనా తబసూమ్, మనోజ్ కార్తి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు సాధించిన విజయాల పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని పేర్కొంటూ, జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల ఫిర్యాదుల పై తక్షణమే స్పందించాలి

సైబర్ వారియర్స్‌తో సమీక్ష సమావేశం
నిర్వహించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శనివారం నాడు సైబర్ వారియర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి, వారి విధులు, బాధ్యతలు, పెండింగ్ సైబర్ నేరాల కేసుల దర్యాప్తు పురోగతి, ఫిర్యాదుల పరిష్కారం, వివిధ పోర్టళ్లపై సిబ్బందికి ఉన్న అవగాహన, పీటీ వారెంట్ల అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాల బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టి బాధితులకు పోలీస్ స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని తెలిపారు. ఎన్సిఆర్పి, జీఆర్ఎం, ఎంఆర్ఎఫ్, సహయోగ్, సమన్వయ, సైబర్ క్రైమ్ అనలిటిక్స్ అండ్ ప్రాసిక్యూషన్ సిస్టమ్ వంటి పోర్టళ్ల విధులు, వినియోగంపై సైబర్ వారియర్స్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. 1930 సైబర్ హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ఆర్థిక సైబర్ మోసాల బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీటీ వారెంట్లను గుర్తించి, వాటి అమలును వేగవంతం చేయాలని, సంబంధిత దర్యాప్తు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అమలైన వారెంట్ల వివరాలను సైబర్ క్రైమ్ అనలిటిక్స్ అండ్ ప్రాసిక్యూషన్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ,

ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని, సైబర్ వారియర్స్ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పెండింగ్ ఫిర్యాదులు, కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ నరేష్, ఎస్సై జుబేదా బేగం, డిఫోర్సి సిబ్బంది, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజా వాయిస్ నారాయణఖేడ్
సిర్గాపూర్ మండలం సంగెం గ్రామ సర్పంచ్ కుటుంబ సభ్యులపై కొందరు దాడులకు పాల్పడి వారిని తీవ్రంగా గాయపరచడంతో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...బాధితులు రతన్ నాయక్, పండరి, రంగుబాయి, సంతుబాయి, గీత బాయి గార్లను తీవ్రంగా కొట్టి గాయపరిచిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వారికి చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు త్వరగా న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. వారితోపాటు సర్పంచ్ భూపాల్,మాజీ ఎంపీటీసీలు ముజామిల్, శ్రీనివాస్ పటేల్ తదితరులు ఉన్నారు.

బీరంగూడ నుండి శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించిన ఈర్ల రాజు

పటాన్ చెరువు ప్రజావాయిస్
పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ మండలం, బీరంగూడ డివిజన్ పరిధిలో శబరిమల అయ్యప్ప స్వామి దర్శనార్థం పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములను బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములకు ఘనంగా సన్మానం చేసి, వారి పవిత్ర శబరిమల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులు యాత్రలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిపై ఉండాలని,

స్వామివారి దర్శనం సాఫీగా పూర్తిచేసుకొని అందరూ క్షేమంగా తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. సనాతన ధర్మం మన భారతీయ సంస్కృతికి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు పునాది. అయ్యప్ప స్వామి దీక్ష అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా, నియమ నిష్ఠలు, ఆత్మనిగ్రహం, సమానత్వం, సేవాభావం, భక్తి వంటి గొప్ప విలువలను నేర్పించే పవిత్ర మార్గమని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి దీక్షను ఆచరిస్తూ కఠిన నియమాలు పాటించి, ఇరుముడి ధరించి, స్వామియే శరణం అయ్యప్ప అనే నామస్మరణతో శబరిమల యాత్ర చేపట్టడం ఎంతో పవిత్రమైన ఆధ్యాత్మిక అనుభూతి అని తెలిపారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు యువతలో క్రమశిక్షణ, సేవా దృక్పథం, మన సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మన సనాతన ధర్మాన్ని, హిందూ సంప్రదాయాలను, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని ఈర్ల రాజు ముదిరాజ్ స్పష్టం చేశారు. దేవాలయాలు, ధార్మిక కార్యక్రమాలు, పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, ప్రతి ఒక్కరూ భక్తి, ధర్మం, సేవ అనే మార్గంలో ముందుకు సాగాలని పిలుప విజయవంతంగా పూర్తిచేసుకుని క్షేమంగా స్వస్థలాలకు తిరిగి రావాలన్నారు

బుద్ధ విహార కి భూమి కేటాయించాలి

బుద్ధ విహార భూమి కోసం తలకొండపల్లి
తహసీల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ప్రజా వాయిస్ తలకొండపల్లి :
రంగారెడ్డి జిల్లా,తలకొండపల్లి మండలం, కేంద్రంలో ధమ్మా ప్రచారం కమిటీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. భగవాన్ బుద్ధుని విహార కోసం తలకొండపల్లి గ్రామంలోని ప్రభుత్వం భూమి కేటాయించాలి అన్ని ఎమ్మార్వో రమేష్ కి విజ్ఞప్తి లెటర్ ఇవ్వడం జరిగింది. భగవాన్ గౌతమ బుద్ధుని శాంతి, అహింస, సమానత్వం,సౌభ్రాతృత్వం, మానవతా విలువలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలనే సదుద్దేశంతో మా ప్రాంతంలో బౌద్ధ విహారం లేదా గౌతమ బుద్ధుని మందిరాన్ని నిర్మించాలని సంకల్పించాము. బౌద్ధ విహారం ద్వారా ప్రజలకు బుద్ధుని బోధనలపై అవగాహన కల్పించడం, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించడం, యువతలో నైతిక విలువలను పెంపొందించడం, సామాజిక ఐక్యతను ప్రోత్సహించడం, మానవతా దృక్పథాన్ని అభివృద్ధి చేయడం మా ప్రధాన లక్ష్యాలు. కావున, తమరు మా వినతిని పరిశీలించి, కొంత భూమిని మంజూరు చేయగలరు అన్ని ఎమ్మార్వో రమేష్ ని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధమ్మ ప్రచారం కమిటీ. ఎమ్మార్పీఎస్ నాయకులు మాజీ జిల్లా అధికార ప్రతినిది – పోతుగంటి కృష్ణ,మాజీ జిల్లా సెక్రటరీ –కిరణ్ పూలె, పోతుగంటి కుమార్ 2వార్డ్ మెంబర్ మాజీ మండల అధ్యక్షులు , మండల అధ్యక్షులు – పోతుగంటి శ్రీకాంత్,పి హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు – పెరుమాండ్ల నారాయణ,మాజీ మండల అధ్యక్షులు– దరవుల రాజు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి వద్దే రాజు. తదితరులు పాలుగోన్నారు.

కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన సమ్మయ్య గౌడ్

మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణాచారి కుటుంబానికి క్వింటా బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజా వాయిస్ / కేసముద్రం:
పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దమోరి తండా గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ పొట్లపల్లి లక్ష్మణాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని సమ్మయ్య గౌడ్ పరామర్శించారు. స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సర్పంచ్ సారంపల్లి దేవేంద్రమోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లక్ష్మణాచారి నివాసానికి చేరుకున్న ఆయన, మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మణాచారి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని మానవతా దృక్పథంతో స్పందించిన సమ్మయ్య గౌడ్.. బాధిత కుటుంబానికి క్వింటా బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని స్థానిక సర్పంచ్ సారంపల్లి దేవేంద్రమోహన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కాలనీకి వచ్చిన సమ్మయ్య గౌడ్‌ను అంబేద్కర్ కాలనీవాసులు మేడి శ్రీనివాస్, అరుణ్ తదితరులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కంటిపూడి అరుణ్ కుమార్, మేడి శ్రీనివాస్, వార్డు సభ్యుడు మూతి సురేందర్, శంకర్, శీలం యాకన్న, బండారి నరేష్, ప్రభాకర్, లవన్న, కుశన్న, దుగ్గి యాకయ్య, బండారి పెద్ద వెంకన్న, బండారి మనోజ్, లక్ష్మణ్, వెంకన్న, రవి, జాటోత్ ప్రవీణ్, కిషన్, ఉప సర్పంచ్ హాలు, ప్రవీణ్, సునీల్, రాకేష్, గాండ్ల మలేంద్రం, దుగ్గి శివ, కొప్పెర ఉదయ్, పులినరీ సారంపల్లి వెంకన్న, కమ్మ యాకమ్మ, గంధసిరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెగ్గర్ల గ్రామంలో రీ-సర్వే షురూ

భూ వివాదాల పరిష్కారానికే ప్రాధాన్యం
కార్యక్రమాన్ని ప్రారంభించిన తహసీల్దార్ రమేష్

ప్రజా వాయిస్, కథలాపూర్:
మండలంలోని పెగ్గర్ల గ్రామంలో రీ–సర్వే కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ గుగ్గిళ్ల రమేష్ ప్రారంభించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం ఈ సర్వే ప్రక్రియను వేగవంతం చేసిందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్ స్పెక్టర్ ఆఫ్ సర్వే సాయిలు, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ (ఆర్ఐ) రవీందర్, గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ) శ్రీనివాస్, స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పులుకుర్తి గ్రామంలో ఖేత్ బచావో అభియాన్‌పై అవగాహన సమావేశం, ర్యాలీ

ప్రజా వాయిస్ హన్మకొండ /దామెర
హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పులుకుర్తి గ్రామంలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం మరియు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాసంగి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎల్ నినో ప్రభావం, జీరో వరి సాగు, పంట అవశేషాల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (రాజూరా) రామకృష్ణ మాట్లాడుతూ, రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్ నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా నీటి లభ్యతను అంచనా వేసుకొని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, సాగు ఖర్చులను తగ్గించుకునే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు జీరో వరి సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలే పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నాలని తెలిపారు. దీనివల్ల నేలలో సేంద్రియ పదార్థాలు పెరిగి,

భూసారం మెరుగుపడటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, నీరు మరియు ఇతర వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ రమేష్ మాట్లాడుతూ, నీటి కొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని, తద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌ను, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, విద్యుత్ శాఖ రమేష్ ఏఈ గారు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గారు, వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ మరియు గ్రామ రైతులు పెరుక సత్యం, కాసెట్టి లక్ష్మణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన ఉమేష్ చంద్ర కు ఆర్థిక సహాయం

ఉన్నత చదువులను పూర్తి చేసుకునే వరకు తన వంతు సహాయంద సహకారాలు అందిస్తాను

ఉమేష్ చంద్ర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

తొర్రూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి

ప్రజా వాయిస్ /తొర్రూరు,

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన చెరుకు లక్ష్మి, సంజీవ కుమారుడు ఉమేష్ చంద్ర మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఐఐటీలో సీటు సాధించిన సందర్భంగా, వారి తల్లిదండ్రులకు తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఉమేష్ చంద్ర తన ఉన్నత చదువులను పూర్తి చేసుకునే వరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తిరుపతి రెడ్డి హామీ ఇచ్చారు. విద్యార్థి భవిష్యత్తుకు అండగా నిలుస్తూ, ఉన్నత విద్యను ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఉమేష్ చంద్ర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తన తల్లిదండ్రులకు, తొర్రూరు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారితో పాటు దొంతోజు కిరణ్ వంశీ పాల్గొని ఉమేష్ చంద్రని అభినందించడం జరిగింది..

రిమ్స్‌లో గర్భిణి మృతి.. సమగ్ర విచారణకు ఏఐవైఎఫ్ డిమాండ్

ప్రజా వాయిస్, ఉట్నూర్/ఆదిలాబాద్

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో గర్భిణి బోర్కర్ సునీత మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాడవి గంగోత్రి, మేస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. ఉట్నూర్ మండలానికి చెందిన సునీత ప్రసవం కోసం నాలుగు రోజుల క్రితం రిమ్స్ ఆస్పత్రిలో చేరగా, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సకాలంలో సరైన వైద్యం అందించి ఉంటే ఆమె ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్యాన్ని సహించబోమని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గిరిజన బిడ్డల భవిష్యత్తుతో చెలగాటం వద్దు

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వీడాలి సచివాలయంలో మంత్రి సమక్షంలో గిరిజనుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజా వాయిస్, హైదరాబాద్:

ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు, విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన జిల్లా గిరిజనుల సమస్యలను ప్రస్తావించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య, కళాశాలల్లో ప్రవేశాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని వివరించారు. సాంకేతిక నిబంధనల పేరుతో అర్హులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే కుల ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాలయాపన లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు గప్పలు

లబ్ధిదారులు, చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్న కనీసం స్పందన కరువు..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం..

లబ్ధిదారులకు బిల్లులు అందక బేస్మెంట్లకే ఇండ్ల నిర్మాణాలు పరిమితం.

ఆరుగురు అధికారులు ఉండగా, విధులకు కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే హాజరవుతున్న వైనం..

27వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ నామా స్రవంతి ఆగ్రహం..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని 27వ వార్డు కౌన్సిలర్ నామా స్రవంతి విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని మొత్తం 37 వార్డుల లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన కోసం నెల రోజుల క్రితం ఆరుగురు అధికారులను నియమించగా, వారిలో కేవలం ముగ్గురు మాత్రమే అప్పుడప్పుడు నామమాత్రంగా విధులకు హాజరవుతున్నారని ఆమె ఆరోపించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా కనీస స్పందన కరువైందని, ఎల్1, ఎల్2 ఎల్3 జాబితాల పేరుతో వారిని గందరగోళానికి గురిచేస్తూ అధికారులు కేవలం కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో పథకం పూర్తిగా నీరుగారుతోందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. 3 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన 313 ఇళ్లలో ఇప్పటివరకు కేవలం 72 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారని, కొంతమంది లబ్ధిదారులు బిల్లులు అందక బేస్మెంట్ లెవెల్ లోనే ఇండ్ల నిర్మాణం ఆపివేశారని , ఇప్పటి వరకు ఇంకా ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించని వారిని రద్దు చేసి ఆ స్థానంలో అర్హులైన లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి రెండో విడత జాబితాను మంజూరు చేయాలని, అలాగే విధులకు హాజరుకాని ముగ్గురు అధికారులపై వెంటనే చర్యలు తీసుకుని వారి స్థానంలో కొత్తవారిని

నియమించాలని ఆమె స్పష్టం చేశారు.

హైతాబాద్‌లో భూ వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణ

మసీదులో చర్చల సమయంలో ముందస్తు పథకంతో దాడి

కత్తితో దాడిలో ఒకరికి గాయాలు

9 మంది అరెస్ట్ మరో ఇద్దరు పరారీ

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

(ప్రజా వాయిస్ షాబాద్)

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం హైతాబాద్ గ్రామంలో సర్వే నంబర్ 202లోని భూమి మరియు ఇతర స్థలాలకు సంబంధించిన దీర్ఘకాలిక వివాదం తీవ్ర ఉద్రిక్తతకు ఘర్షణకు దారితీసింది హైతాబాద్‌కు చెందిన చాంద్ పాషా కుటుంబానికి హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులకు మధ్య గత కొంతకాలంగా ఈ భూ తగాదా నడుస్తోంది ఈ నేపథ్యంలో గ్రామంలోని మసీదు వద్ద ఇరువర్గాలు చర్చల కోసం సమావేశమైన సమయంలో

వివాదం తారాస్థాయికి చేరింది చాంద్ పాషా మరియు ఆయన కుమారులైన సోహెల్ ఫైజల్‌లపై దాడి చేయడానికి నిందితులు ముందస్తు పథకం వేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో స్పష్టమైంది. హైదరాబాద్ నుంచి రెండు కార్లు ఒక మోటార్ సైకిల్‌పై ఆయుధాలతో ముందస్తు ప్రణాళికతో వచ్చిన వారు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు ఈ ఘర్షణ సమయంలో ముజఫర్ ఉద్దీన్ కత్తితో దాడి చేయడంతో నవీద్ (24) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ భీకర దాడిలో ఇరువర్గాలకు చెందిన వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి గాయపడిన నవీద్‌ను వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని ఆస్పత్రికి తరలించారు ఈ ఘటనతో హైతాబాద్ గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో షాబాద్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జి చేసి అల్లరి మూకలను చెదరగొట్టారు. ఈ కేసులో వేగంగా దర్యాప్తు జరిపిన పోలీసులు మొత్తం 11 మందిలో తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు పంచుల సమక్షం లో నిర్వహించిన విచారణలో భాగంగా ఘర్షణకు ఉపయోగించిన రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, రెండు క్రికెట్ బ్యాట్లు, కత్తి మరియు పలు మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ఈ కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ఎండిపోయిన పంటలకు నష్టానికి పరిహారం ఇవ్వాలి

రాత్రిపూట కరెంటు ఇవ్వటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు

12 గంటలు విద్యుత్తు ఇస్తామని ఆరు గంటలు కూడా ఇవ్వకపోవడం దారుణం

ఈనెల 30న రైతులను సమీకరించి నియోజకవర్గంలో ఆందోళన చేపడుతాం

సబ్‌స్టేషన్ ముందు బిజెపి నిరసన

నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఎల్లేని సుధాకర్ రావు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

ముందుచూపు లేకపోవడం వల్లనే రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు విద్యుత్ అంతరాయాలు కోతలపై బిజెపి ఆధ్వర్యంలో నిరసన

వ్యక్తం చేశారు విద్యుత్ సమస్యను రైతుల ను విద్యుత్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు 12 గంటలు విద్యుత్ ఇస్తామని ఐదు ఆరు గంటలు కూడా ఇవ్వకపోవడం దారుణం అన్నారు రాత్రిపూట కరెంటు ఇవ్వటం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని 12 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు ఎల్ ని నో ప్రభావం ఉందని తెలిసి కూడా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోలేక పోయిందన్నారు కాలువల్లో సిల్క్ జమ్మూ ఉండటంవల్ల వారబంధిలో ఇచ్చే నీరు కూడా చివరాయకట్టు వరకు చేరడం లేదని సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు అని ఆయన అన్నారు. నాలుగు రోజుల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాల్వ ద్వారా తాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ నెల 30న రైతులను సమీకరించి నియోజకవర్గం లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు శ్రీను జగ్గారి శ్రీధర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు నారాయణ మాజీ అధ్యక్షులు రాకేష్ శివ , విష్ణు కౌన్సిల్ సభ్యులు నరేష్ ఉపాధ్యక్షులు రాణా ప్రతాప్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాకేష్, రైతులు వెంకటేశ్వర్ రెడ్డి, బాలయ్య, సాయి కృష్ణ, సాయిబాబు, మల్లయ్య, కృష్ణయ్య, ఆవులయ్య, తదితరులు పాల్గొన్నారు.

తీవ్రంగా మారుతున్న తాగునీటి సమస్య

అంచనాలకే పరిమితమైన అధికారులు..

నిధులు మంజూరు చేయని ప్రభుత్వం

సర్పంచుల సమావేశంలో ఆందోళన..

విద్యుత్ సరఫరాపైనా నిలదీత

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

వీపనగండ్ల మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోందని ఆయా గ్రామాల సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారులు అంచనాలు రూపొందించి పంపడానికే పరిమితమవుతున్నారని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో సర్పంచులు ఈ సమస్యలను ప్రస్తావించారు. నిధులు మంజూరైతేనే తాగునీటి సమస్యకు పరిష్కారం! మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయంపై నాగర్లబండ తండా సర్పంచ్ గోపాల్ ప్రశ్నించగా అధికారులు ఇదే సమాధానం ఇచ్చారు. అయితే గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నిధుల మంజూరులో జాప్యం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని సర్పంచులు ఆందోళన వ్యక్తం

చేశారు. అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా.. రైతులకు తప్పని ఇబ్బందులు సమావేశంలో విద్యుత్ సరఫరాపై కూడా సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాల సమస్యలతో పాటు వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. వేళాపాళా లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో రైతుల వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, వరి పంట పొట్ట దశలో ఉన్న సమయంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గోపాల్ దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత మాట్లాడుతూ,,, గ్రామ సమీపంలో నూతన సబ్‌స్టేషన్ మంజూరై ప్రారంభమైనప్పటికీ, అక్కడి నుంచి రైతులకు ఆశించిన స్థాయిలో విద్యుత్ సరఫరా కావడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కల్వరాల సర్పంచ్ బండారి రాముడు సైతం విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. అయితే సంబంధిత విద్యుత్ శాఖ అధికారి సమావేశానికి హాజరుకాకపోవడంతో సమస్యలపై పూర్తిస్థాయి సమాచారం అందుబాటులో లేదని అధికారులు తెలిపారు. ఈ అంశాలను నమోదు చేసుకుని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. పలు శాఖల అధికారుల హాజరు. ఈ సమావేశానికి తహసీల్దార్ ఖాజా మైనుద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి డాకేశ్వర్ గౌడ్, ఉద్యానవన శాఖ అధికారి కృష్ణయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని పలువురు సర్పంచులు హాజరయ్యారు. ప్రజలకు తాగునీటి సమస్య నుంచి విముక్తి కల్పించడంతో పాటు, రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరుతున్నారు.